మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ

# డ్రీమ్ టైమ్స్

తెలుగు దిన పత్రిక

బుధవారం 14 -10-2026
పేజీలు: 8 వెల: రూ.2/-

సంపుటి:5 సంచిక 313

## విలేకరులు కావలెను




తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా డ్రీమ్ టైమ్స్ దినపత్రికలో బ్యూరో, మండలాల రిపోర్టర్ గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహవంతులైన యువతి ,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును

8500066609

Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District

## లడఖ్ మాదే!

- 28 ప్రాంతాలకు పేర్లు పెట్టిన భారత్
- భారత్ నిర్ణయంపై చైనా అభ్యంతరం
- చైనా మాటలను పట్టించుకోని భారత్
- మా భూభాగమేనని స్పష్టం చేసిన కేంద్రం
- అధికారిక పటంలో కొత్త పేర్లు
- సరిహద్దు వివాదంపై మళ్లీ రగడ
- లడఖ్‌పై వెనక్కి తగ్గేది లేదన్న భారత్




## యూపీఐ ఛార్జీలపై వెనక్కి తగ్గిన కేంద్రం!

- దీపావళి తర్వాతే కొత్త ఛార్జీలు
- రూ.2 వేలకుపైగా చెల్లింపులపై 0.4 శాతం రుసుం
- ఫెస్టివల్ సీజన్‌లో వ్యాపారులకు ఊరట
- సెప్టెంబర్‌లో భారీగా నమోదైన లావాదేవీలు
- ఛార్జీల అమలుపై కొనసాగుతున్న ఉత్కంఠ
- అమలు తేదీ త్వరలో ప్రకటిస్తామన్న ఎన్‌పీసీఐ




## చెన్నైకి తాగునీరు ఇవ్వండి!

**చంద్రబాబును కోరిన తమిళనాడు సీఎం విజయ్**

- ఉండవల్లిలో ఏపీ, తమిళనాడు ముఖ్యమంత్రుల సమావేశం
- అదనపు జలాలు విడుదల చేయాలని విజ్ఞప్తి
- ఇప్పటికే 4.08 టీఎంసీల నీరు విడుదల
- నీటి లభ్యతను బట్టి మరింత సాయం చేస్తామన్న చంద్రబాబు
- ఏపీలోనూ నీటి కొరత ఉందని వెల్లడి
- గోదావరి--కావేరి అనుసంధానంపై చర్చ
- రెండు రాష్ట్రాలకు ప్రయోజనం కలుగుతుందన్న చంద్రబాబు

**అమరావతి,**

చెన్నై నగరంలో తాగునీటి అవసరాలను తీర్చేందుకు తెలుగు గంగ ద్వారా అదనపు జలాలను విడుదల చేయాలని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. విజయవాడ ఉత్సవ్‌లో పాల్గొనేందుకు వచ్చిన విజయ్ మంగళవారం అమరావతిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరు రాష్ట్రాల మధ్య నీటి పంపకాలపై ప్రధానంగా చర్చించారు. సీఎం విజయ్, ఆయన వెంట వచ్చిన అధికారులకు చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో

-మిగతా 3 లో







## ఏపీకి వర్ష సూచన..

- రానున్న మూడు రోజులు వానలు
- బంగాళాఖాతంలో ద్రోణి..
- పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు
- బంగాళాఖాతంలో ద్రోణి, ఈశాన్య రుతుపవనాల ప్రభావం
- బుధవారం పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలకు అవకాశం
- పిడుగులు పడతాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచన
- ఏపీఎస్డీఎంఏ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్

**అమరావతి,**

ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. బంగాళాఖాతంపై ఏర్పడిన ద్రోణితో పాటు ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు నమోదు అవుతాయని ఏపీఎస్డీఎంఏ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు.

**ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం...**

బుధవారం (అక్టోబర్ 14) పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖ, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలతో పాటు పోలవరం పరిసర ప్రాంతాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి

-మిగతా 3 లో




## 2029లోనూ కాంగ్రెస్‌కు ఓటమే!

- రాహుల్ నాయకత్వంపై అమిత్ షా విమర్శలు
- ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ ఆరోపణలను తప్పుబట్టిన హోంమంత్రి
- గుజరాత్ ఓటమికి కూడా ఎస్ఐఆర్ కారణమా?
- కాంగ్రెస్ గత ఎన్నికల ఫలితాలపై ప్రస్తావన
- రాహుల్ రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచే ఓటములంటూ వ్యాఖ్య
- 2029లోనూ పరాజయం తప్పదని జోస్యం
- ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడుతామన్న రాహుల్
- ఎస్ఐఆర్‌పై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం




## మమతపై హత్యాయత్నం?

- మమత నివాసం వెలుపల ఘటన
- దుర్గాపూజ మండపం ప్రారంభోత్సవానికి వెళ్తుండగా కలకలం
- చీర లాగేందుకు యువతి ప్రయత్నించిందని ఆరోపణ
- చీరలో కత్తి దాచినట్లు టీఎంసీ నేతల వెల్లడి
- ఘటనపై టీఎంసీ శ్రేణుల ఆందోళన
- యువతిని పట్టుకుని పోలీసులకు అప్పగింత

## సిరీస్‌పై భారత్ గురి!

**నేడు ఉప్పల్‌లో భారత్--వెస్టిండీస్ నాలుగో టీ20**

- 2-1 ఆధిక్యంతో బరిలోకి టీమ్‌ఇండియా
- గెలిస్తే మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్ సొంతం
- సంజు శాంసన్‌కు తుది జట్టులో చోటు దక్కే అవకాశం
- టాప్ ఆర్డర్‌పైనే భారీ అంచనాలు
- బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉప్పల్ పిచ్
- పరుగుల వర్షం కురుస్తుందా?

03

సిరీస్ కైవసమే లక్ష్యంగా టీమ్‌ఇండియా కీలక పోరుకు సిద్ధమైంది. ఉప్పల్‌లో నేడు వెస్టిండీస్‌తో జరిగే నాలుగో టీ20లో గెలిచి మరో మ్యాచ్ మిగిలుండగానే ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను సొంతం చేసుకోవాలని భారత్ పట్టుదలగా ఉంది. 2-1 ఆధిక్యంతో బరిలోకి దిగుతున్న టీమిండియాకు టాప్ ఆర్డర్ బ్యాటర్ల ప్రదర్శన కీలకం కానుంది. బ్యాటింగ్‌కు అనుకూలించే ఉప్పల్ పిచ్‌పై పరుగుల వరద పారుతుందా? సంజు శాంసన్, కుల్దీప్ యాదవ్‌లకు తుది జట్టులో అవకాశం దక్కుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.




## నవరాత్రి ఉత్సవాల వేళ స్వామిఅమ్మవార్లకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు





**శ్రీశైలం, అక్టోబర్ 13 (డ్రీమ్ టైమ్స్):**

శ్రీశైల మహాక్షేత్రంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్న నేపథ్యంలో మంగళవారం స్థానిక గౌరవ శాసనసభ్యులు శ్రీ బుడ్డా రాజశేఖరరెడ్డి గారు శ్రీ భ్రమరాంబికా సమేత శ్రీ మల్లికార్జున స్వామివార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ శ్రీ పోతుగుంట రమేష్ నాయుడు గారు, కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు గారు దగ్గరుండి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహింపజేశారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శ్రీశైల మహాక్షేత్రంలో భక్తి మైమరపించే వాతావరణం నెలకొంది. అమ్మవారి విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఆలయం భక్తి పారవశ్యంతో అలరారుతోంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిఅమ్మవార్లను దర్శించుకుంటున్నారు. దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్, కార్యనిర్వహణాధికారి పర్యవేక్షణలో ఉత్సవాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు సమన్వయంతో కొనసాగుతున్నాయి. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించడం, రద్దీని నియంత్రించడం, ఉత్సవ కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించడం వంటి అంశాలపై దేవస్థానం యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. దేవస్థానం అధికారులు, సిబ్బంది సమన్వయంతో శరన్నవరాత్రి ఉత్సవాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి.



## శ్రీశైలంలో దసరా మహోత్సవాలు..

- నిత్య కళారాధన వేదికపై సంగీతం, పౌరాణిక నాటకం

**శ్రీశైలం, (డ్రీమ్ టైమ్స్)**

శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా మహోత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదికపై పలు ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అలాగే శ్రీస్వామి అమ్మవార్ల గ్రామోత్సవంలో వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు జానపద కళారూపాలతో భక్తులను అలరించారు. నిత్య కళారాధన వేదికపై సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు సికింద్రాబాద్‌కు చెందిన డాక్టర్ విశాలాక్షి, వారి బృందం గాత్ర సంగీత కార్యక్రమాన్ని ప్రదర్శించారు. అనంతరం రాత్రి 7.30 గంటల నుంచి నెల్లూరుకు చెందిన కె. సుధాకరరావు, వారి బృందం 'గయోపాఖ్యానం' పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించారు.

**గ్రామోత్సవంలో జానపద కళారూపాలు**

శ్రీస్వామి అమ్మవార్ల గ్రామోత్సవంలో భాగంగా నాదస్వరం, కేరళ చండీ మేళం, కొమ్ము, కోయ నృత్యం, థయ్యం, విళక్కు, స్వాగత నృత్యం, కోలాటం, రాజభటుల వేషాలు, జానపద పగటి వేషాలు, అశ్వ ప్రదర్శన, డమరుకం, చిడతలు, శంఖం, పిల్లనగ్రోవి, త్రిశూలం, జేగంట, కంచుడోలు, చెక్కభజన,

-మిగతా 3 లో

## ఏపీ స్థానిక సమరం

**'కూటమిలో 'సీట్ల' 'సర్దుబాటు'పై తీవ్ర కసరత్తు..**

- ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక ఎన్నికల వేళ ఎన్డీయేలో జోరందుకున్న సీట్ల పంపకాల చర్చలు
- ముందుగా జనసేనతో డీల్ ఖరారు
- ఆపై బీజేపీతో చర్చించాలని చంద్రబాబు నిర్ణయం
- తమ త్యాగాలకు గుర్తింపుగా తగిన ప్రాతినిధ్యం ఇవ్వాలని కోరిన పవన్
- మంగళవారం రాత్రి సీఎం నివాసంలో టీడీపీ, జనసేన నేతల తుది భేటీ
- అక్టోబర్ 14న నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉండటంతో చర్చల్లో పెరిగిన వేగం

**అమరావతి, ఏపీ బ్యూరో**

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అధికార ఎన్డీయే కూటమిలో సీట్ల పంపకాలపై మంతనాలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. మంగళవారం నాడు తెలుగుదేశం, జనసేన, బీజేపీ నేతల మధ్య చర్చలు తారాస్థాయికి చేరాయి. కూటమి లోని భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల సర్దుబాటును సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

-మిగతా 3 లో



# కేంద్ర బలగాలను ఈ నెల 20 వరకు ఉపసంహరించొద్దు..

**-హోంశాఖకు ఢిల్లీ పోలీసుల లేఖ**



**అక్టోబర్ 13.(డ్రీమ్ టైమ్స్)**
ఆందోళనలు ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో కేంద్ర సాయుధ పోలీసు బలగాల లను ఇప్పుడే ఉససంహరించవద్దని, కేంద్ర బలగాల మోహరింపును ఈ నెల 20 వరకు పొడిగించాలని ఢిల్లీ పోలీసులు (ణవశ్రీష్ట్రఱ ూశీశ్రీఱఛవ) కోరారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ కి లేఖ రాశారు. ఈ విషయాన్ని ఢిల్లీ ఉన్నతాధికారులు మంగళవారం వెల్లడించారు. ఆందోళనలు పెరిగే అవకాశం ఉందనే నిఘావర్గాల సమాచారం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. శాంతిభద్రతలను కాపాడటంతోపాటు ఉద్రిక్తతలకు తావులేకుండా ఉండేందుకే గడువు పెంచాలని కోరినట్లు చెప్పారు. కాగా ప్రస్తుతం విధుల్లో ఉన్న 273 కంపెనీల బలగాల మోహరింపు గడువు సోమవారంతో ముగిసింది. మరోవైపు జంతర్‌మంతర్, ఎన్నికల సంఘం కార్యాలయం, పార్లమెంట్ హౌస్, ఇండియా గేట్ వంటి ప్రాంతాల్లో నిరసనలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. ఈ 273 సీఏపీఎఫ్ కంపెనీల మోహరింపును పొడిగించాలని పోలీసులు తమ లేఖలో పేర్కొన్నారు. నిరసనల నేపథ్యంలో ఢిల్లీలో మొత్తం 301 కంపెనీల సీఏపీఎఫ్ బలగాలకు అనుమతి లభించింది. అక్టోబర్ 6న 221 కంపెనీలకు, 8న మరో 80 కంపెనీలకు ఆమోదం తెలపడంతో ఆ కంపెనీలు విధుల్లో పాల్గొన్నాయి. అదనంగా మంజూరైన 80 బలగాల్లో 28 సోమవారం నాటికి ఢిల్లీకి చేరుకోలేదు.

# ప్రజాస్వామ్యానికి భారత్ తల్లి వంటిది!

**నిరసనలపై ఉక్కుపాదం మోపి ప్రధాని మోదీ వాక్కులు**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 13.(డ్రీమ్ టైమ్స్)**: దేశ రాజధానిలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనలకు అడ్డుకునే క్రమంలో భద్రతా సిబ్బంది నిరసనకారులపై దాడి చేయడం, వారిని అదుపులోకి తీసుకోవడం, వేధించడం వంటి చర్యలకు పాల్పడిన తర్వాత ప్రజల ముందుకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాస్వామ్యానికి భారత్ తల్లిగా అభివర్ణించారు. మంగళవారం న్యూఢిల్లీలో ప్రారంభమైన బ్లూమ్‌బర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌లో మోదీ సుదీర్ఘ ప్రసంగం చేశారు. అధికారం ఎవరి చేతిలో ఉన్నది అనేది అసలు ప్రశ్న కాదు. ఆ అధికారాన్ని ఎలా ఉపయోగిస్తున్నారు అన్నదే అసలు ప్రశ్న అని మోదీ తన విధానాలకు విరుద్ధంగా వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యయుత నిరసనలను అణచివేస్తూనే భారతదేశం ప్రజాస్వామ్యానికి తల్లిగా పేర్కొన్న మోదీ భారతీయుల సోషల్ మీడియా వినియోగాన్ని కూడా నొక్కిచెప్పారు.

# గేటు దూకి జంతర్ మంతర్‌లోకి..

**పోలీసుల అదుపులో సీజేపీ నాయకులు**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 13.(డ్రీమ్ టైమ్స్)**
ఇతర మద్దతుదారులతో పాటు సీజేపీ కార్యకర్త అజింక్యా షిండేను కూడా అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు కావడానికి ముందు రాంకా ఎక్స్‌లో ఒక వీడియో క్లిప్‌ను పోస్ట్ చేశారు. అందులో, తాను, దాస్, ఇతర సీజేపీ మద్దతుదారులు ఒక గేటు పైనుంచి దూకి జంతర్ మంతర్ ప్రాంగణంలోకి ప్రవేశిస్తున్నట్టు ఆ వీడియోలో ఉంది.ఆయన ఆ వీడియోకు జంతర్ మంతర్ జోలికి రావద్దు అని శీర్షిక పెట్టారు. జంతర్ మంతర్ సమీపంలోని జనతాదళ్(యునైటెడ్) కార్యాలయ ప్రాంగణం వైపు నుంచి ఆ బృందం నిరసన స్థలంలోకి ప్రవేశించినట్టు తెలుస్తున్నది. వెంటనే పోలీసులు ఆ ప్రాంతంలోకి ప్రవేశించిన వారినందరినీ అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తమను అదుపులోకి తీసుకుంటున్నప్పుడు రాంకా, ఇతర సీజేపీ మద్దతుదారులు ఇంక్విలాబ్ జిందాబాద్, భారత్ మాతా కీ జై అని నినాదాలు చేస్తున్న వీడియోను కూడా దాస్ ఎక్స్‌లో పోస్ట్‌చేశారు. జంతర్ మంతర్‌ను స్వాధీనం చేసుకున్నామని ప్రకటించిన ఆయన లోపలికి ప్రవేశించడాన్ని యువతరానికి ఒక సందేశంగా అభివర్ణించారు.

# రాహుల్ నన్ను తోసేశాడు

**గర్భిణి జర్నలిస్టు తీవ్ర ఆరోపణలు**



**న్యూఢిల్లీ:అక్టోబర్ 13.(డ్రీమ్ టైమ్స్)**
సర్ ప్రక్రియపై విపక్షాలు జరిపిన నిరసన సందర్భంగా సోమవారం సుప్రీంకోర్టు ప్రాంగణంలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తన చేతిని దురుసుగా లాగి, తోసివేశారని మూడు నెలల గర్భవతి అయిన ఒక జర్నలిస్టు ఆరోపించారు. అయితే ఇలాంటి ఘటన ఏదీ జరగలేదని కాంగ్రెస్ ఖండించింది. ఇది బీజేపీ సృష్టించిన ప్రచారమని పార్టీ పేర్కొంది. తనపై దాడి జరిగిందని ఆరోపించిన 'ఒన్ ఇండియా' వార్తా వెబ్‌సైట్‌కు చెందిన రిచా పరాశర్ దేశ రాజధానిలోని ఒక దవాఖానలో చేరారు. రాహుల్ గాంధీ మద్దతుదారులు తన గురించి దుర్భాషలాడటం, తాను అనుభవించిన ఘటనను తక్కువ చేసి చూపడానికి ప్రయత్నించడం పట్ల తీవ్ర మనస్తాపానికి గురైనట్టు ఆమె చెప్పారు.

# ఫ్రాన్స్‌లో వందలాది సూపర్ మార్కెట్లపై సైబర్ దాడి

**-ఫ్రిజ్‌లలో '50' దాటిన ఉష్ణోగ్రతలు**
**-పెద్దమొత్తంలో పాడైపోయిన ఆహారం**
**-కొన్ని స్టోర్లలో చెలరేగిన మంటలు**



**పారిస్: అక్టోబర్ 13.(డ్రీమ్ టైమ్స్)**
ఫ్రాన్స్‌లో వందలాది సూపర్ మార్కెట్లపై సైబర్ దాడి జరిగింది. రిఫ్రిజిరేషన్ వ్యవస్థల ధ్వంసం లక్ష్యంగా ఈ దాడి జరిగింది. దీని కారణంగా దేశవ్యాప్తంగా 480 దుకాణాలు, స్టోర్లలోని ఫ్రిజ్‌లు, ఫ్రీజర్ల ఉష్ణోగ్రత 50 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుని అధిక ఉష్ణోగ్రతకు పలు స్టోర్లలోని ఫ్రిజ్‌లకు మంటలంటుకున్నాయి. కోట్లాది యూరోల నష్టం ఏర్పడిన ఈ తరహా సైబర్ దాడి దేశంలో ఇదే ప్రథమమని ఫ్రాన్స్ అధికారులు తెలిపారు. ఫ్రెంచ్ మీడియా కథనం ప్రకారం చాలా స్టోర్లలోని ఫ్రిజ్‌లు, ఫ్రీజర్లు ఆటోమేటిక్‌గా డీఫ్రాస్ట్ మోడ్‌లోకి వెళ్లేలా హ్యాకర్లు సైబర్ దాడి చేశారు. దీంతో తాజా, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు పాడవ్వడమే కాక, అధిక ఉష్ణోగ్రతకు పేలుడు సంభవించి మంటల్లో చిక్కుకున్నాయి.పలు స్టోర్లలోని ఫ్రిజ్‌లు మంటల్లో చిక్కుకున్నాయని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై వెంటనే దర్యాప్తు జరపాలని ఫ్రెంచి ప్రధాని లెకోర్న్ దేశ సైబర్ సెక్యూరిటీ సంస్థ ఏఎన్ఎస్ఎస్ఐను ఆదేశించారు. ఇతర ఐరోపా దేశాల్లో కూడా ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయా? అని ప్రభుత్వం ఆరాతీస్తున్నది. పలు ఆహార రిటైల్ సంస్థల్లో ఇంటర్నెట్‌తో అనుసంధానించి ఉన్న రిఫ్రిజిరేటర్లపై ఈ దాడి జరిగిందని పారిస్ ప్రాసిక్యూటర్ కార్యాలయం తెలిపింది. కాగా, ప్రధాని ఆఫీస్ అధికారి ప్రకారం డెన్మార్క్‌కు చెందిన డాన్‌ఫాస్ కంపెనీ సాఫ్ట్‌వేర్‌లో ఫ్రాన్స్ సైబర్ సెక్యూరిటీ ఒక లోపాన్ని గుర్తించింది. ఈ కంపెనీ సిస్టమ్‌లను సూపర్‌మార్కెట్ ఫ్రిజ్‌లు, ఫ్రీజర్‌లను నియంత్రించడానికి ఉపయోగిస్తారు. కాగా, దుర్ఘటనలకు కారణమైన సిస్టమ్‌లలో కంపెనీ సాఫ్ట్‌వేర్ పాత వెర్షన్ నడుస్తున్నది. తమ సాఫ్ట్‌వేర్‌లను అప్‌డేట్ చేసుకోవాలని, పాతబడిన పరికరాలను మార్చుకోవాలని చాన్నాళ్లుగా తమ వినియోగదారులకు సలహాలు ఇస్తున్నట్టు ఆ కంపెనీ తెలిపింది.

**ఎలా జరిగింది?**
సూపర్‌మార్కెట్ ఫ్రిజ్‌లు, ఫీజర్‌లు సాధారణంగా స్టోర్ మొత్తం రిఫ్రిజిరేషన్ ప్రక్రియను నిర్వహించే ఒక కంట్రోల్ ప్యానల్ వ్యవస్థ ద్వారా పనిచేస్తాయి. ఈ ప్యానెళ్లు ఇంటర్నెట్‌కు అనుసంధానించి ఉంటాయి. కాబట్టి నిర్వహణ సంస్థలు వాటి సెట్టింగ్‌లను రిమోట్‌గా మార్చగలవు. ఒక వేళ హ్యాకర్ ఈ వ్యవస్థలోకి ప్రవేశించగలిగితే వారు భద్రతా లోపాలను ఉపయోగించుకుని ఫ్రిజ్‌లు, ఫ్రీజర్‌ల సెట్టింగ్‌లను మార్చగలరు. దీనివల్ల వారు కూలింగ్‌ను తగ్గించడం, లేదా డీఫ్రాస్టింగ్‌కు మార్చగలరు.

# భారత సైన్యానికి మరింత బలం..

**-450 నాగాస్త్ర-1ఆర్ డ్రోన్లు అందజేత**
**-ఒకేసారి 450 డ్రోన్లను అందించిన దేశీయ సంస్థ**
**-సైనిక అవసరాల కోసం ప్రత్యేకంగా తయారీ**
**-తక్కువ దూరంలోని లక్ష్యాలపై దాడి చేసే సామర్థ్యం**
**-అవసరమైతే వెనక్కి వచ్చి సురక్షితంగా దిగే అవకాశం**



**న్యూఢిల్లీ:అక్టోబర్ 13.(డ్రీమ్ టైమ్స్)**
భారత సైన్యానికి మరింత బలం చేకూరనుంది. దేశీయంగా తయారైన 450 నాగాస్త్ర-1ఆర్ డ్రోన్లను సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ (ఎస్‌డీఏఎల్) భారత సైన్యానికి అందించింది. ఒకే దశలో ఇంత పెద్ద సంఖ్యలో డ్రోన్లను సరఫరా చేయడం ఈ సంస్థకు కీలక మైలురాయిగా నిలిచింది. సైనిక అవసరాల కోసం అత్యవసర కొనుగోళ్లలో భాగంగా ఈ డ్రోన్లను తయారు చేయించారు. తక్కువ దూరంలోని లక్ష్యాలను గుర్తించి దాడి చేయగల సామర్థ్యం వీటి ప్రత్యేకత. నాగాస్త్ర-1ఆర్ డ్రోన్లు లక్ష్యంపై దాడి చేయడానికి రూపొందించిన ప్రత్యేక రకానికి చెందినవి. వీటిని సాధారణంగా 'కమికాజి' లేదా 'సూసైడ్ డ్రోన్లు' అని పిలుస్తారు. లక్ష్యాన్ని ఢీకొని పేలడం ద్వారా దాడి చేయడం ఈ రకమైన డ్రోన్ల ప్రధాన లక్షణం. అయితే, నాగాస్త్ర-1ఆర్ విషయంలో అవసరాన్ని బట్టి ప్రయాణాన్ని నిలిపివేసి వెనక్కి మళ్లే సామర్థ్యం కూడా ఉందని అందించిన సమాచారం పేర్కొంటోంది. దీంతో ప్రతి పరిస్థితిలోనూ డ్రోన్‌ను నాశనం చేయాల్సిన అవసరం ఉండకపోవచ్చు.

**ఒకేసారి భారీ సరఫరా**
సోలార్ ఇండస్ట్రీస్ ఇండియా అనుబంధ సంస్థ అయిన ఎస్‌డీఏఎల్ ఈ డ్రోన్లను తయారు చేసింది. ఒకే దశలో 450 డ్రోన్లను సైన్యానికి అందించడం దేశీయ రక్షణ ఉత్పత్తుల రంగంలో ప్రాధాన్యం సంతరించుకుంది. సైనిక అవసరాలకు అనుగుణంగా ఆయుధాలు, సాంకేతిక పరికరాలను దేశంలోనే తయారు చేసుకునే ప్రయత్నాలకు ఇది ఉదాహరణగా నిలుస్తోంది. విదేశాల నుంచి ఆయుధాలను కొనుగోలు చేయడంపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు దేశీయ ఉత్పత్తులు ఉపయోగపడతాయి. గత ఏడాది మార్చిలో భారత సైన్యం ఈ డ్రోన్ల తయారీ కోసం వివిధ సంస్థలను ఆహ్వానించింది. నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా డ్రోన్లను తయారు చేయగల సంస్థలకు అవకాశం కల్పించేలా ప్రక్రియ చేపట్టింది. ఈ పోటీలో ఎస్‌డీఏఎల్ నిర్దేశిత ప్రమాణాలను అందుకోవడంతో టెండర్ దక్కించుకున్నట్లు సమాచారం. అనంతరం అత్యవసర కొనుగోలు ప్రక్రియలో భాగంగా డ్రోన్ల తయారీ, సరఫరా చేపట్టింది.

**లక్ష్యంపై దాడి.. అవసరమైతే వెనక్కి**
యుద్ధభూమిలో శత్రు లక్ష్యాలను గుర్తించి వాటిపై దాడి చేయడానికి డ్రోన్లు కీలకంగా మారుతున్నాయి. ముఖ్యంగా తక్కువ దూరంలోని లక్ష్యాలపై దాడి చేయగల డ్రోన్లు సైన్యానికి ఉపయోగకరంగా ఉంటాయి. సైనికుల ప్రాణాలకు ప్రమాదం కలగకుండా దూరం నుంచే లక్ష్యాలపై చర్యలు చేపట్టేందుకు ఇవి సహాయపడతాయి. సంప్రదాయ ఆయుధాలతో పోలిస్తే కొన్ని సందర్భాల్లో తక్కువ ఖర్చుతో లక్ష్యాన్ని చేరుకునే అవకాశం కూడా ఉంటుంది. సాధారణంగా ఒకసారి ప్రయోగించిన దాడి డ్రోన్లు లక్ష్యాన్ని చేరుకున్న తర్వాత తిరిగి వినియోగించుకునే అవకాశం ఉండదు. అయితే, కొన్ని ఆధునిక డ్రోన్లలో ప్రయాణాన్ని మధ్యలో నిలిపివేసి తిరిగి వెనక్కి వచ్చే సౌకర్యం ఉంటుంది. నాగాస్త్ర-1ఆర్ డ్రోన్లకు కూడా అవసరాన్ని బట్టి వెనక్కి మళ్లే, సురక్షితంగా దిగే సామర్థ్యం ఉన్నట్లు సమాచారం. ఈ సదుపాయం వల్ల పరిస్థితులకు అనుగుణంగా వాటి వినియోగంపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది. అయితే, ఈ సామర్థ్యాలు ఏయే పరిస్థితుల్లో పనిచేస్తాయనే పూర్తి సాంకేతిక వివరాలు అందుబాటులో ఉన్న సమాచారంలో స్పష్టంగా లేవు.

**దేశీయ తయారీతో ఖర్చుల తగ్గింపు**
ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు తమ రక్షణ సామర్థ్యాలను పెంచుకునేందుకు ఆధునిక ఆయుధాలు, డ్రోన్లను సమకూర్చుకుంటున్నాయి. యుద్ధాలు, సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో ఆయుధాల కొనుగోలు దేశాలపై భారీ ఆర్థిక భారాన్ని మోపుతోంది. ఈ పరిస్థితుల్లో దేశీయంగా రక్షణ పరికరాలను తయారు చేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. అవసరమైన సాంకేతికతను అభివృద్ధి చేసుకుని, దేశంలోనే ఉత్పత్తి చేయడం ద్వారా విదేశీ కొనుగోళ్లపై ఆధారపడటాన్ని కొంతవరకు తగ్గించవచ్చు. దేశీయ తయారీ సంస్థలకు సైన్యం నుంచి ఆర్డర్లు లభించడం వల్ల ఉత్పత్తి సామర్థ్యాలు పెరగడంతోపాటు కొత్త సాంకేతికతల అభివృద్ధికి ప్రోత్సాహం లభిస్తుంది. సైన్యానికి అవసరమైన పరికరాలను వేగంగా సరఫరా చేసే అవకాశం కూడా ఉంటుంది. నాగాస్త్ర-1ఆర్ డ్రోన్ల సరఫరా ఈ దిశగా మరో ముందడుగుగా భావిస్తున్నారు.

**మరిన్ని ఆధునిక ఆయుధాలపై దృష్టి**
ఎస్‌డీఏఎల్ భవిష్యత్తులో మరిన్ని ఆధునిక రక్షణ పరికరాలను తయారు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. మారుతున్న యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా డ్రోన్లు, ఇతర సాంకేతిక ఆయుధాల అవసరం పెరుగుతోంది. నిఘా, లక్ష్యాలను గుర్తించడం, దాడి సామర్థ్యాలను మెరుగుపరచడం వంటి అవసరాల్లో డ్రోన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో దేశీయ సంస్థలు సాంకేతికతను అభివృద్ధి చేయడం, నాణ్యతా ప్రమాణాలను పాటించడం ముఖ్యమవుతోంది. భారత సైన్యానికి 450 నాగాస్త్ర-1ఆర్ డ్రోన్లు అందడం వల్ల దేశీయ రక్షణ తయారీ రంగానికి ప్రోత్సాహం లభించనుంది. అయితే, వీటి వాస్తవ వినియోగం, పనితీరు, సైనిక అవసరాలకు అనుగుణంగా అందించే సేవలపై మరిన్ని అధికారిక వివరాలు వెలువడాల్సి ఉంది. దేశ రక్షణ అవసరాలను తీర్చడంలో దేశీయ తయారీ సంస్థల పాత్ర భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం ఉంది.

# పాకిస్థాన్‌లో రైలు ప్రమాదం.. ఆరుగురు దుర్మరణం

**-పట్టాలు తప్పిన రెహమాన్ బాబా ఎక్స్‌ప్రెస్**
**-మరో 30 మందికి గాయాలు**
**-పంజాబ్ ప్రావిన్స్‌లో తెల్లవారుజామున ప్రమాదం**
**-కరాచీ నుంచి పెషావర్ వెళ్తుండగా ఘటన**
**-ముల్తాన్‌లో షేర్ షా బ్రిడ్జి సమీపంలో ప్రమాదం**
**-14 రైలు పెట్టెలు పట్టాలు తప్పినట్లు సమాచారం**



**పాకిస్థాన్:అక్టోబర్ 13.(డ్రీమ్ టైమ్స్)**
పాకిస్థాన్‌లో ఘోర రైలు ప్రమాదం జరిగింది. పంజాబ్ ప్రావిన్స్‌లో మంగళవారం ఉదయం ప్రయాణికుల రైలు పట్టాలు తప్పడంతో ఆరుగురు దుర్మరణం పాలయ్యారు. మరో 30 మంది గాయపడ్డారు. కరాచీ నుంచి పెషావర్‌కు వెళ్తున్న రెహమాన్ బాబా ఎక్స్‌ప్రెస్ ముల్తాన్‌లోని షేర్ షా బ్రిడ్జి సమీపంలో ప్రమాదానికి గురైంది. రైలులోని 14 పెట్టెలు పట్టాలు తప్పినట్లు అధికారులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. మృతుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు అధికారులు వెల్లడించారు. గాయపడిన వారిని సమీపంలోని వివిధ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రుల పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. రైలు పట్టాలు తప్పడంతో ఆ మార్గంలో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. దెబ్బతిన్న రైల్వే మార్గాన్ని పునరుద్ధరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. మరమ్మతులు పూర్తయిన తర్వాత రైళ్ల రాకపోకలను తిరిగి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారుల నుంచి మరిన్ని వివరాలు వెలువడాల్సి ఉంది.

# సౌదీకి ఇండిగో విమానాలు రద్దు!

**-అక్టోబర్ 17 వరకు సర్వీసులు నిలిపివేత**
**-రియాద్, జెద్దా, దమ్మాం, మదీనా విమానాలపై ప్రభావం**
**-ప్రయాణికుల భద్రత కోసమే నిర్ణయం**
**-విమానాల వివరాల కోసం వెబ్‌సైట్ చూడాలని సూచన**
**-ప్రయాణికులకు సహాయక బృందం అందుబాటులో**




**న్యూఢిల్లీ:అక్టోబర్ 13.(డ్రీమ్ టైమ్స్)**
సౌదీ అరేబియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత్-సౌదీ మధ్య విమాన సర్వీసులను అక్టోబర్ 17 వరకు రద్దు చేస్తున్నట్లు ఇండిగో ప్రకటించింది. రియాద్, జెద్దా, దమ్మాం, మదీనా విమానాశ్రయాలకు వెళ్లే, అక్కడి నుంచి వచ్చే సర్వీసులు నిలిచిపోనున్నాయి. ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ తెలిపింది. విమానాల తాజా వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించింది.

# లడఖ్ మాదే!



న్యూఢిల్లీ:
లడఖ్‌లోని 28 ప్రాంతాలకు పేర్లను ఖరారు చేస్తూ భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై చైనా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ నిర్ణయం చట్టవిరుద్ధమని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి మావో నింగ్ పేర్కొన్నారు. సరిహద్దులోని ఆ ప్రాంతాలు తమవేనని చైనా వాదించింది. అయితే, చైనా అభ్యంతరాలను భారత్ తోసిపుచ్చింది. లడఖ్ భారతదేశంలో అంతర్భాగమని, దాన్ని ఎవరూ విడదీయలేరని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. చైనా వ్యతిరేకించినంత మాత్రాన వాస్తవాలు మారవని తెలిపారు. స్థానికులతో సంప్రదింపుల తర్వాత ఈ ప్రాంతాల పేర్లను అధికారిక భారత పటంలో చేర్చాలని నిర్ణయించినట్లు వివరించారు. భారత్ పేర్లు ఖరారు చేసిన ప్రాంతాల్లో సరిహద్దు వివాదం ఉన్న గోగ్రా, హాట్ స్ప్రింగ్స్ కూడా ఉన్నాయి. ఈ నిర్ణయంతో లడఖ్‌పై తమ హక్కులను భారత్ మరోసారి స్పష్టం చేసింది. గల్వాన్ లోయలో భారత, చైనా సైనికుల మధ్య ఘర్షణ జరిగినప్పటి నుంచి ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. సరిహద్దు వివాదంపై చర్చలు జరుగుతున్నప్పటికీ, ఇరుదేశాలు తమ వాదనలకు కట్టుబడి ఉన్నాయి. తాజా పేర్ల వివాదం మరోసారి ఇరుదేశాల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది.

## 2029లోనూ కాంగ్రెస్‌కు ఓటమే!



న్యూఢిల్లీ:
ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా తప్పుబట్టారు. రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ వరుసగా ఎన్నికల్లో ఓటములు ఎదుర్కొంటోందని విమర్శించారు. 2029 ఎన్నికల్లోనూ ఆ పార్టీకి పరాజయం తప్పదని వ్యాఖ్యానించారు. రాహుల్‌గాంధీ, ఇండియా కూటమి ఎంపీలు నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశం అనంతరం అమిత్ షా మీడియాతో మాట్లాడారు. ఎస్ఐఆర్ ప్రక్రియను కాంగ్రెస్ తన ఎన్నికల ఓటములకు కారణంగా చూపడాన్ని ఆయన ప్రశ్నించారు. గుజరాత్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమికి కూడా ఎస్ఐఆర్ కారణమా? అని నిలదీశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ 2024 తర్వాత ప్రారంభమైందని అమిత్ షా పేర్కొన్నారు. అయితే, రాహుల్‌గాంధీ రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచే కాంగ్రెస్ పలు ఎన్నికల్లో ఓటములు ఎదుర్కొంటోందని విమర్శించారు. పశ్చిమ బెంగాల్, త్రిపుర, గుజరాత్ రాష్ట్రాల్లో గత కొన్ని దశాబ్దాలుగా కాంగ్రెస్ విజయాలు సాధించలేకపోయిందని ప్రస్తావించారు. మరోవైపు, దేశ ప్రజాస్వామ్య ప్రక్రియను పరిరక్షించేందుకు తమ పోరాటం కొనసాగుతుందని రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాల సవరణలో అక్రమాలు జరుగుతున్నాయన్న కాంగ్రెస్ ఆరోపణలు, వాటిని బీజేపీ ఖండించడం నేపథ్యంలో అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ వాగ్వాదం మరింత ముదిరింది.

## మమతపై హత్యాయత్నం?

మొదటి తరువాయి

కోల్‌కతా

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీపై హత్యాయత్నం జరిగినట్లు ఆ పార్టీ ఆరోపించింది. కోల్‌కతాలోని కాళీఘాట్ ప్రాంతంలో ఉన్న ఆమె నివాసం వెలుపల ఈ ఘటన చోటుచేసుకుంది. దుర్గాపూజ మండపం ప్రారంభోత్సవానికి మమత బయలుదేరుతున్న సమయంలో ఓ యువతి అక్కడికి వచ్చినట్లు టీఎంసీ నేతలు తెలిపారు. ఆమె మమత చీరను లాగేందుకు ప్రయత్నించిందని, చీరలో కత్తి దాచినట్లు గుర్తించామని పేర్కొన్నారు. అప్రమత్తమైన పార్టీ నేతలు, కార్యకర్తలు యువతిని పట్టుకుని కాళీఘాట్ పోలీసులకు అప్పగించారు. అయితే, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, పోలీసుల అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## కేంద్ర మంత్రి మురుగన్ రాజీనామా

మొదటి తరువాయి

ప్రధాని నరేంద్ర మోదీ వద్ద మంత్రిగా పనిచేయడం తన జీవితంలో దక్కిన గొప్ప గౌరవమని మురుగన్ పేర్కొన్నారు. అయితే, రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కార్యకర్తలతో కలిసి పూర్తిస్థాయిలో పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు వివరించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి క్షేత్రస్థాయి కృషి కీలకమని భావిస్తున్నట్లు ఆయన మాటలను బట్టి తెలుస్తోంది. మురుగన్ రాజీనామా నేపథ్యంలో కేంద్ర మంత్రివర్గంలో మార్పులపై ఊహాగానాలు మళ్లీ మొదలయ్యాయి. దీపావళికి ముందే మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరిగే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కనీసం ఆరు మంత్రి పదవులు ఖాళీ అయ్యే అవకాశాలున్నట్లు సమాచారం. అయితే, పునర్వ్యవస్థీకరణ ఎప్పుడు జరుగుతుంది, ఎవరికి అవకాశం దక్కుతుంది అనే అంశాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

## ఏపీకి వర్ష సూచన..

మొదటి తరువాయి

మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. మిగతా జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడతాయని పేర్కొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రఖర్ జైన్ సూచించారు. పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున వర్షం సమయంలో చెట్లు, భారీ హోర్డింగుల కింద నిలబడవద్దని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే రైతులు, కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు

## శ్రీశైలంలో దసరా మహోత్సవాలు..

మొదటి తరువాయి

అమ్మవారి వేషం, తప్పెట చిందు, డోలు విన్యాసం, వీరభద్ర డోలుకుణిత తదితర సంప్రదాయ కళారూపాలు భక్తులను విశేషంగా అలరించాయి. కన్నడ జానపద కళా కార్యక్రమాలు సైతం గ్రామోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దసరా మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమాలు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు భారతీయ సంప్రదాయ కళలు, సంస్కృతిని చాటిచెప్పాయి.

# యూపీఐ ఛార్జీలపై వెనక్కి తగ్గిన కేంద్రం!

**-దీపావళి తర్వాతే కొత్త ఛార్జీలు**
**-రూ.2 వేలకుపైగా చెల్లింపులపై 0.4 శాతం రుసుం**
**ఫెస్టివల్ సీజన్‌లో వ్యాపారులకు ఊరటలి**
**సెప్టెంబర్‌లో భారీగా నమోదైన లావాదేవీలు**
**ఛార్జీల అమలుపై కొనసాగుతున్న ఉత్కంఠ**
**అమలు తేదీ త్వరలో ప్రకటిస్తామన్న ఎన్‌పీసీఐ**

న్యూఢిల్లీ:
యూపీఐ చెల్లింపులపై మర్చెంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) ఛార్జీలు విధించాలన్న నిర్ణయంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో కేంద్ర ప్రభుత్వం, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) వెనక్కి తగ్గాయి. ముందుగా ఈ నెల 15 నుంచి అమలు చేయాలని భావించిన ఛార్జీలను దీపావళి తర్వాతే అమల్లోకి తీసుకువస్తామని ఎన్‌పీసీఐ ప్రకటించినట్లు సమాచారం. అయితే, ఛార్జీల విధానంలో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేసింది. ప్రతిపాదన ప్రకారం, వ్యాపారులకు చేసే రూ.2,000 కంటే ఎక్కువ విలువైన కొన్ని యూపీఐ చెల్లింపులపై 0.4 శాతం ఎండీఆర్ ఛార్జీ విధించనున్నారు. ఒక్కో లావాదేవీపై గరిష్ఠంగా రూ.300 వరకు వసూలు చేయాలని నిర్ణయించారు. డిజిటల్ చెల్లింపులను నిర్వహించే బ్యాంకులు, చెల్లింపుల సంస్థలు వ్యాపారులకు సేవలందించేందుకు ఈ రుసుమును ప్రతిపాదించారు. ఇంధనం, విద్యుత్ వంటి కొన్ని రంగాల్లో లావాదేవీలకు రూ.5 స్థిర రుసుము నిర్ణయించినట్లు సమాచారం. ఎండీఆర్ ఛార్జీల ప్రతిపాదనపై దేశవ్యాప్తంగా పలువురు వ్యాపారులు, వ్యాపార సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. యూపీఐ చెల్లింపులపై అదనపు భారం పడితే డిజిటల్ చెల్లింపుల వినియోగం తగ్గే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశాయి. నిరసనలో భాగంగా 'నో యూపీఐ డే' పేరుతో ఆందోళనకు దిగాయి. ప్రజలకు ఉచితంగా అందుబాటులో ఉన్న డిజిటల్ చెల్లింపులపై ఛార్జీలు విధించడం వల్ల యూపీఐపై నమ్మకం దెబ్బతినవచ్చని పలువురు అభిప్రాయపడ్డారు. దేశంలో యూపీఐ వినియోగం భారీగా పెరుగుతోంది. అందుబాటులో ఉన్న




గణాంకాల ప్రకారం, సెప్టెంబర్‌లో రోజువారీ లావాదేవీలు సగటున 80.2 కోట్లుగా నమోదయ్యాయి. మొత్తం లావాదేవీల సంఖ్య గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే 22.6 శాతం పెరిగినట్లు సమాచారం. రోజువారీ లావాదేవీల విలువ సుమారు రూ.97,913 కోట్లుగా నమోదైంది. ఆగస్టుతో పోలిస్తే లావాదేవీల సంఖ్యలో స్వల్ప తగ్గుదల కనిపించినప్పటికీ, డిజిటల్ చెల్లింపుల వినియోగం విస్తృతంగానే కొనసాగుతోంది. ఛార్జీల అమలును దీపావళి తర్వాతకు వాయిదా వేయడంతో వ్యాపారులకు తాత్కాలిక ఊరట లభించినప్పటికీ, ప్రతిపాదనపై సందేహాలు మాత్రం కొనసాగుతున్నాయి. యూపీఐ చెల్లింపులపై అదనపు రుసుములు విధిస్తే చిన్న వ్యాపారులు, వినియోగదారులపై ఎలాంటి ప్రభావం పడుతుందన్నది చర్చనీయాంశంగా మారింది. ఛార్జీల అమలు విధానం, తుది నిర్ణయంపై స్పష్టత రావాల్సి ఉంది.

# చెన్నైకి తాగునీరు ఇవ్వండి!

మొదటి తరువాయి

చెన్నై నగర తాగునీటి అవసరాల కోసం ఏపీ ప్రభుత్వం మరింత సహకరించాలని విజయ్ విజ్ఞప్తి చేశారు. దీనిపై చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. అయితే, ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో కృష్ణా నదిలో నీటి లభ్యత తగ్గిందని, ఆంధ్రప్రదేశ్‌లోనూ నీటి కొరత పరిస్థితులు ఉన్నాయని వివరించారు. అయినప్పటికీ పొరుగు రాష్ట్ర ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని చంద్రబాబు తెలిపారు. ఇప్పటికే ఒప్పందం ప్రకారం చెన్నై నగరానికి 4.08 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు వెల్లడించారు. ప్రాజెక్టుల్లో నీటి లభ్యత, రాష్ట్ర అవసరాలను పరిశీలించి మరింత నీటిని విడుదల చేసే అంశాన్ని పరిశీలిస్తామని విజయ్‌కు హామీ ఇచ్చారు.



**గోదావరి--కావేరి అనుసంధానంపై చర్చ**

ఈ సమావేశంలో గోదావరి--కావేరి నదుల అనుసంధాన ప్రాజెక్టు అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది. కరవు సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం చూపడంలో ఈ ప్రాజెక్టు కీలకంగా నిలుస్తుందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఈ పథకం అమలైతే ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలకే కాకుండా దేశానికి కూడా ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. ఇరు రాష్ట్రాల మధ్య నీటి సమస్యల పరిష్కారం, చెన్నై తాగునీటి అవసరాలు, భవిష్యత్తులో నీటి విడుదలకు సంబంధించిన అంశాలపై సమావేశంలో చర్చలు జరిగాయి. ఈ భేటీలో ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సిరీస్‌పై భారత్ గురి!

**నేడు ఉప్పల్‌లో భారత్--వెస్టిండీస్ నాలుగో టీ20**
**2-1 ఆధిక్యంతో బరిలోకి టీమ్‌ఇండియా**
**గెలిస్తే మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్ సొంతం**
**సంజు శాంసన్‌కు తుది జట్టులో చోటు దక్కే అవకాశం**
**టాప్ ఆర్డర్‌పైనే భారీ అంచనాలు**
**కుల్దీప్ యాదవ్‌కు అవకాశం దక్కేనా?**
**బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉప్పల్ పిచ్**
**పరుగుల వర్షం కురుస్తుందా?**

హైదరాబాద్

భారత్--వెస్టిండీస్ జట్ల మధ్య జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కీలక దశకు చేరుకుంది. ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా నేడు నాలుగో టీ20 జరగనుంది. గత మ్యాచ్‌లో విజయం సాధించి సిరీస్‌లో 2-1 ఆధిక్యంలోకి వచ్చిన టీమ్‌ఇండియా.. ఈ మ్యాచ్‌లోనూ గెలిచి మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను కైవసం చేసుకోవాలని పట్టుదలగా ఉంది. మరోవైపు వెస్టిండీస్ ఈ మ్యాచ్‌లో విజయం సాధించి సిరీస్‌ను 2-2తో సమం చేయాలని భావిస్తోంది. భారత జట్టులో ఓపెనర్లుగా అభిషేక్ శర్మ,




సంజు శాంసన్ బరిలోకి దిగే అవకాశముంది. గత మ్యాచ్‌లో సంజు పెద్దగా రాణించకపోయినా, అంతకుముందు మ్యాచ్‌లో కీలక స్కోరు సాధించాడు. ఉప్పల్ మైదానంలో అతడికి ఉన్న అనుభవం కూడా కలిసిరావచ్చని భావిస్తున్నారు. దీంతో యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీకి మరోసారి తుది జట్టులో చోటు దక్కకపోవచ్చని అంచనా. మూడో స్థానంలో ఇషాన్ కిషన్, నాలుగో స్థానంలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ఐదో స్థానంలో తిలక్ వర్మ బ్యాటింగ్‌కు వచ్చే అవకాశం ఉంది. వీరంతా రాణిస్తే భారత్ భారీ స్కోరు సాధించగలదని అభిమానులు ఆశిస్తున్నారు. ఆల్‌రౌండర్లుగా నమన్ ధీర్, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్ జట్టులో కొనసాగే అవకాశముంది. బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ వీరు రాణించగలగడం జట్టుకు బలంగా మారనుంది. బౌలింగ్ విభాగంలోనూ మార్పులు జరిగే అవకాశం ఉంది. పెద్ద మైదానమైన ఉప్పల్‌లో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు అవకాశం కల్పిస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది. అతడికి చోటు దక్కితే ప్రిన్స్ యాదవ్ బెంచ్‌కు పరిమితం కావచ్చు. అర్ష్‌దీప్ సింగ్, మయాంక్ యాదవ్ పేస్ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. ఉప్పల్ పిచ్ సాధారణంగా బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. వేగవంతమైన అవుట్‌ఫీల్డ్, బౌండరీల పరిస్థితుల కారణంగా భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశముంది. టాస్ గెలిచిన జట్టు ముందుగా బౌలింగ్ ఎంచుకునే అవకాశం ఉందని అంచనా. వాతావరణం అనుకూలిస్తే మ్యాచ్‌కు అంతరాయం కలగకపోవచ్చని భావిస్తున్నారు.

భారత్ అంచనా జట్టు: అభిషేక్ శర్మ, సంజు శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ, నమన్ ధీర్, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, ప్రిన్స్ యాదవ్/కుల్దీప్ యాదవ్, మయాంక్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్.

వెస్టిండీస్ అంచనా జట్టు: హోప్ (కెప్టెన్, వికెట్ కీపర్), కమిల్, హెట్‌మయర్, పావెల్, రూథర్‌ఫర్డ్, షెపర్డ్, చైజ్, స్ప్రింగర్, పాల్, జోసెఫ్, మోతీ.

## ఏపీ స్థానిక సమరం

**నేడు ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం...**

అక్టోబర్ 14న ఎన్నికల షెడ్యూల్ వెలువడవచ్చన్న అంచనాల నేపథ్యంలో, ఆ లోపే పంపకాలను పూర్తి చేసి ఐక్యంగా బరిలోకి దిగాలని కూటమి భావిస్తోంది. ఈ క్రమంలో భాగంగా నేడు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ముఖ్యమంత్రి చంద్రబాతో సమావేశమయ్యారు. రెండు రోజుల్లో వీరి మధ్య ఇది రెండో దఫా చర్చలు కావడం గమనార్హం. అయితే, బీజేపీతో చర్చలను కొలిక్కితెచ్చే ముందు, జనసేనకు కేటాయించాల్సిన సీట్లపై ఒక స్పష్టతకు రావాలని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యూహంలో భాగంగానే ఆయన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడు తో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. అనంతరం, పల్లా శ్రీనివాసరావు, నిమ్మల రామా నాయుడు నేరుగా జనసేన కార్యాలయానికి వెళ్లి ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో చర్చలు జరిపారు. ఈ సమావేశంలో జనసేన తరపున మంత్రి నాదెండ్ల మనోహర్, వంశీకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**తాజా సమాచారం ప్రకారం..**

మంగళవారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో టీడీపీ, జనసేన నేతలు మరోసారి భేటీ కానున్నారు. ఈ సమావేశంలోనే సీట్ల సర్దుబాటుపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ముఖ్యమైన నగరపాలక సంస్థల మేయర్ అభ్యర్థుల ఎంపికపైనా ఈ భేటీలో చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జనసేన, బీజేపీలు తమ బలాబలాల ఆధారంగా ఆశిస్తున్న స్థానాల జాబితాను చంద్రబాబుకు అందజేశాయి. పార్టీల గెలుపు అవకాశాలను బట్టి సీట్ల కేటాయింపు ఉంటుందని కూటమి వర్గాలు చెబుతున్నాయి. గత వారం కూడా చంద్రబాబు, పవన్ కల్యాణ్ మధ్య సీట్ల పంపకాలు, ఎన్నికల వ్యూహాలు, క్షేత్ర స్థాయిలో సమన్వయం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చలు జరిగాయి.

**స్థానిక సంస్థల్లో తమకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలి**

ఈ చర్చల నేపథ్యంలో, అక్టోబర్ 11న పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కూటమి ఏర్పాటు, విజయం కోసం జనసేన, జన సైనికులు ఎన్నో త్యాగాలు చేశారని, ఆ త్యాగాలకు గుర్తింపుగా మిత్ర ధర్మాన్ని అనుసరించి స్థానిక సంస్థల్లో తమకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన స్పష్టం చేశారు. "2024 ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్తు కోసం పోరాడాం. ఇప్పుడు జరగబోయే స్థానిక ఎన్నికలు జనసైనికుల భవిష్యత్తుకు భరోసా ఇస్తాయని ఆశిస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు.

**2014లో కూడా జన సైనికులు త్యాగాలు చేశారు**

2014లో కూడా జనసైనికులు త్యాగాలు చేశారని పవన్ తెలిపారు. "2014లో కూటమికి మద్దతుగా నిలిచినప్పుడు ఒక్క జన సైనికుడు కూడా పదవి ఆశించలేదు. రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని నిస్వార్థంగా పనిచేశారు. వ్యక్తిగత ప్రయోజనాలను పక్కన పెట్టి పార్టీ కోసం, కూటమి కోసం ఎన్నో త్యాగాలు చేశారు" అంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల ద్వారా, స్థానిక ఎన్నికల్లో తమ పార్టీ శ్రేణులకు న్యాయం జరగాలనే సంకేతాన్ని పవన్ బలంగా పంపారు. దీంతో సర్దుబాటు ప్రక్రియలో జనసేన డిమాండ్లకు ఎలాంటి ప్రాధాన్యం లభిస్తుందనేది ఆసక్తికరంగా మారింది

## రైతు డిస్కమ్ పేరుతో ఉచిత విద్యుత్తుకు ఎసరు!

మొదటి తరువాయి

పట్టించుకోకుండా రైతు డిస్కమ్ ఏర్పాటుకు జీవో 17 జారీ చేయడాన్ని ఆయన మంగళవారం 'ఎక్స్' వేదికగా ఖండించారు. జీవోను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కొత్త జీవో ప్రకారం వ్యవసాయ కనెక్షన్లతోపాటు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, మిషన్ భగీరథ, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు పరిధిలోని కనెక్షన్లు కలిపి మొత్తం 30,62,853 కనెక్షన్లను రైతు డిస్కమ్‌కు బదిలీ చేశారని హరీశ్‌రావు తెలిపారు. ఈ వ్యవస్థ కింద 6.15 లక్షల వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు, 2.51 లక్షల కిలోమీటర్ల ఎల్‌టీ విద్యుత్తు లైన్లు ఉన్నాయని వివరించారు. ఇంత పెద్ద వ్యవస్థను కేవలం 2 వేల మంది సిబ్బందితో ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే మార్చేందుకు సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని, భవిష్యత్తులో సమస్యలు వస్తే ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న విద్యుత్తులో 53.28 శాతం థర్మల్ విద్యుత్తు ఉన్నప్పటికీ, రైతు డిస్కమ్‌కు 25 శాతం మాత్రమే కేటాయించారని హరీశ్‌రావు పేర్కొన్నారు. పగటిపూట మాత్రమే అందుబాటులో ఉండే సౌర విద్యుత్తును 58 శాతం, ఏడాదిలో మూడు నుంచి నాలుగు నెలలే ఉత్పత్తయ్యే జలవిద్యుత్తును 100 శాతం కేటాయించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. మిగిలిన ఎనిమిది నెలల్లో రైతులకు కరెంటు ఎలా సరఫరా చేస్తారని ప్రశ్నించారు. ఈ విధానం వల్ల రైతులు ఇబ్బందులు పడే ప్రమాదం ఉందని విమర్శించారు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లకు నిత్యావసర సరుకులు సరఫరా చేసేందుకు తీసుకొచ్చిన కేంద్రీకృత పీఎంయూ టెండర్లను కూడా వెంటనే రద్దు చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో తెలంగాణ గురుకుల కాంట్రాక్టర్ల సంఘం ప్రతినిధులు కలిసి తమ సమస్యలను వివరించారు. కొత్త విధానం వల్ల వేలాది మంది స్థానిక చిన్న వ్యాపారులు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ నోట్‌బుక్‌ల కొనుగోళ్లలో రూ.2 వేల కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. ఇప్పుడు నిత్యావసర సరుకుల కొనుగోళ్లలోనూ 20 శాతం వరకు కమీషన్లు వసూలు చేయాలని చూస్తున్నారని విమర్శించారు. రైతు డిస్కమ్ జీవోను వెనక్కి తీసుకోవడంతోపాటు పీఎంయూ టెండర్లను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలపై ప్రభుత్వం స్పందించాల్సి ఉంది.

## సంపాదకీయం

# దేశానికే దిక్సూచిగా కేసీఆర్ పాలన



కరువు, వలసలతో అల్లాడిన తెలంగాణ వ్యవసాయాన్ని 'పండుగ'గా మార్చడం కేసీఆర్ ప్రభుత్వ ఘనవిజయం. పూడికలతో నిండిన చెరువులకు మిషన్ కాకతీయ ద్వారా పునర్జీవం పోసి, గ్రామీణ జలవనరులను పునరుద్ధరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకమైన కాళేశ్వరం ద్వారా గోదావరి జలాలను విస్తృత ప్రాంతాలకు తరలించి, బీడుభూములను సస్యశ్యామలం చేశారు. ఈ చర్యల ఫలితంగా సాగు విస్తీర్ణం 1.31 కోట్ల ఎకరాల నుంచి 2.2 కోట్ల ఎకరాలకు పెరిగింది. ధాన్యోత్పత్తి కూడా బహుళ రెట్లు అభివృద్ధి చెందింది. రైతుబంధు ద్వారా ఎకరానికి, ఏడాదికి రూ.10 వేల పెట్టుబడి సాయం, రైతు బీమా ద్వారా రూ.5 లక్షల ఆర్థిక భద్రత, 24 గంటల ఉచిత విద్యుత్తు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైతు వేదికల నిర్మాణం రైతులకు పూర్తి మద్దతునిచ్చాయి.

**ప్రజల వద్దకే సంక్షేమ పాలన**

పాలన ప్రజల ముంగిట ఉండాలనే సూత్రంతో పరిపాలనా వికేంద్రీకరణ జరిగింది. ప్రాజెక్టులు, భౌగోళిక పరిస్థితులు, ప్రజా సౌకర్యాలను దృష్టిలో ఉంచి 10 జిల్లాలను 33 జిల్లాలుగా పునర్విభజన చేశారు. కొత్తగా రెవెన్యూ డివిజన్లు, మండలాలు, గ్రామ పంచాయతీలు, పోలీస్ కమిషనరేట్లు ఏర్పాటు చేయడం ద్వారా అధికారులు ప్రజలకు దగ్గరయ్యారు. గిరిజన ప్రాంతాల్లోని తండాలు, గూడేలకు ప్రత్యేక గ్రామ పంచాయతీ హోదా ఇవ్వడం ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచింది. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు, పల్లె ప్రగతి ద్వారా పరిశుభ్రత, పచ్చదనం, స్మశానవాటికలు, చెత్త నిర్వహణ వంటి సౌకర్యాలు గ్రామీణ జీవన నాణ్యతను మెరుగుపరిచాయి.

**విద్యా, వైద్యరంగంలో విప్లవం**

పేద, వెనుకబడిన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు గురుకుల విద్యా సంస్థలు విస్తరించాయి. 'మన ఊరుమన బడి' కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతి గదులు, సైన్స్ ల్యాబ్‌లు, తాగునీరు, విద్యుత్తు సౌకర్యాలు కల్పించారు. జూనియర్, డిగ్రీ కళాశాలల ఆధునీకరణతో గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి వచ్చింది. వైద్యారోగ్య రంగంలో జిల్లాకొక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశారు. దవాఖానలు, మౌలిక సదుపాయాలు విస్తరించాయి. పడకల సంఖ్య, ఐసీయూలు, డయాలసిస్ కేంద్రాలు, బస్తీ దవాఖానాలు పెరగడంతో పేదలకు స్థానికంగానే నాణ్యమైన చికిత్స అందే విధంగా మారింది. టిమ్స్ నిర్మాణం, నిమ్స్ విస్తరణతో హైదరాబాద్ మెడికల్ హబ్‌గా ప్రసిద్ధి చెందింది.

**విద్యుత్తు, పారిశ్రామిక పురోగతి**

రాష్ట్ర ఏర్పాటు సమయంలో విద్యుత్తు కొరత తీవ్రంగా ఉన్నప్పటికీ, స్వరాష్ట్రంలో కేసీఆర్ ప్రణాళికలు, పట్టుదలతో ఉత్పత్తి సామర్థ్యాన్ని 7,778 మెగావాట్ల నుంచి దాదాపు 20 వేల మెగావాట్లకు పెంచారు. వ్యవసాయానికి నిరంతర ఉచిత విద్యుత్తు అందించి, పరిశ్రమలకు అవసరమైన నాణ్యమైన కరెంటును సరఫరా చేశారు. టీఎస్-ఐపాస్ విధానం ద్వారా పరిశ్రమల అనుమతులకు పారదర్శక విధానం తీసుకొచ్చారు. నిర్ణీత కాలపరిమితితో అనుమతులు జారీ చేసే పాలసీని అమలు చేశారు. దీంతో కొత్త పెట్టుబడులను ఆకర్షించి, లక్షలాది యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు సృష్టించారు.

**సంక్షేమం, ఆర్థిక వృద్ధి**

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా పింఛన్లు, దళితబంధు, గొర్రెల పంపిణీ, మత్స్యకార సంక్షేమం వంటి పథకాలు సమాజంలోని అన్ని వర్గాలకు భద్రత కల్పించాయి. ఫలితంగా 2014-15లో రూ.5.06 లక్షల కోట్లుగా ఉన్న జీఎస్డీపీ 2022-23 నాటికి రూ.13.13 లక్షల కోట్లకు పెరిగింది. తలసరి ఆదాయం రూ.3,12,398గా నమోదై, జాతీయ సగటు రూ.1,72,276ను అధిగమించింది. బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేండ్ల పాలనా కాలంలో సాధించిన ఈ బహుముఖ ప్రగతి కేవలం మౌలిక సదుపాయాల విస్తరణే కాదు, ప్రజల ఆత్మగౌరవానికి, ఆత్మవిశ్వాసానికి నిలువెత్తు సాక్ష్యం. కేసీఆర్ దార్శనిక నాయకత్వం తెలంగాణను దేశానికే అభివృద్ధి దిక్సూచిగా నిలబెట్టింది.

# పబ్లిసిటీకి తప్ప ఎందుకూ పనికిరానిది!



ప్రధాని మోదీ ప్రచార ప్రణాళికలో ఒక పార్శ్వం దేశీయమైతే మరొకటి అంతర్జాతీయం. తన ప్రచారదుర్గంలో భాగంగా 'విశ్వగురు' అనే మాటను కూడా తమ మొదటి ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టారు. తన కోసం తన వందిమాగధులతో ఆ బిరుదు ఇప్పించుకున్నారు. ఏ దేశానికి పోయినా అక్కడి అత్యున్నత పౌరసత్కారాలు, పతకాలను మరే దేశాధినేత చేయని విధంగా ఇప్పించుకోవటం ఒక సంప్రదాయంగా మార్చుకున్నారని అంతర్జాతీయ మీడియా ఇటీవలనే కథనాలు రాసింది. హడావుడిగా తయారు చేయించటం వల్ల ఆ పతకాలూ పత్రాల్లో కొన్ని సందర్భాల్లో దొర్లిన తప్పులను కూడా ఎత్తిచూపింది. ప్రధాని మోదీ పబ్లిసిటీ కాంక్షకు ఇటువంటివన్నీ దృష్టాంతాలవుతున్నాయి. అటువంటి కోవలోకి వచ్చేదే రష్యా-ఉక్రెయిన్ శాంతిసూత్రం సంగతి. అయితే ఆయన అధికారులు ఒక జాగ్రత్త తీసుకున్నారు. మోదీ సూత్రాలు అసలు యుద్ధ పరిష్కారానికి అనిగాక, యుద్ధం వల్ల తలెత్తిన తక్షణ సమస్యల నివారణకు అని పేర్కొన్నారు. ఇంతకూ ఆ సూత్రాలు ఏమిటి? ఒకటి, రెండు దేశాలు కూడా అవతలి పక్షపు మౌలిక సదుపాయాలపై దాడులు ఆపటం. రెండు, నిత్యావసరాల సరఫరాలకు ఆటంకం కలిగించకపోవటం. మూడు, నల్ల సముద్రం మీదుగా వాణిజ్య నౌకల రాకపోకలకు రక్షణ కల్పించటం. వాస్తవానికి వీటిలో ఏ ఒక్కటీ మోదీ ప్రభుత్వం కొత్తగా చేసిన ప్రతిపాదన కాదు. ఐక్యరాజ్య సమితి సహా వేర్వేరు వైపుల నుంచి లోగడ వచ్చినవే. వేర్వేరు పక్షాలు తరచు పునశ్చరిస్తున్నవే. ఈ మాట మోదీ విదేశాంగశాఖకు తెలియదనుకోలేము. అంతేకాదు. దిగ్బంధాన్ని ఎత్తివేయాలని, లేనట్టయితే అనేక దేశాలకు ఆహార ధాన్యం, ఎరువుల రవాణాలో తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయని ఐక్యరాజ్య సమితి, అమెరికా, ఆఫ్రికన్ దేశాలు చేసిన విజ్ఞప్తి దరిమిలా కొద్ది వారాలపాటు ఉభయపక్షాలు కొన్ని సడలింపులను ఇచ్చాయి కూడా. తర్వాత వెనుకటి పరిస్థితే ఏర్పడింది. ఇటువంటి నేపథ్యమంతా ఉన్నందున ఈ తరహా శాంతి పథకాలను ముందుకు తేవటాన్ని మిగిలిన వారు మరచిపోయారు. ఇప్పుడు ఉన్నట్టుండి మోదీ ప్రభుత్వానికి గుర్తుకువచ్చింది. అందుకు కారణం పైన అనుకున్నట్టు ప్రస్తుతం భారతదేశంలో సాగుతున్న అశాంతి అనుకుంటే పొరపాటు ఉండకపోవచ్చు. కానీ ఈ ఎత్తుగడ పారగల అవకాశం లేదు. స్వదేశంలోని అశాంతి తీవ్రంగా మారుతున్నది. అందుకే కావచ్చు ఈ యుద్ధశాంతి వార్తలను మోదీ అనుకూల పత్రికలు కూడా సీరియస్‌గా తీసుకోలేదు. శాంతి నెలకొనాలని, ఆ ప్రాంతం నుంచి సరఫరాలు సవ్యంగా సాగాలని కోరుకోవటంలో తప్పుపట్టవలసిందేమీ లేదు. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్యగల నల్ల సముద్రం కీలకమైనది. రష్యా నుంచి చమురు తదితరాలు, ధాన్యం ఆ సముద్రం మీదుగా నిరంతరం రవాణా అవుతుండేవి.

2022 నుంచి సాగుతున్న యుద్ధం కారణంగా ముఖ్యంగా ఉక్రెయిన్ నుంచి ఈ రవాణాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సముద్రం మధ్యలో గల క్రిమియా దీవిని రష్యా ప్రస్తుత యుద్ధానికి ముందే 2014లో ఆక్రమించటం ఉక్రెయిన్‌కు మరింత సమస్య అయింది. ఈ పరిణామాల వల్ల సమస్యలను ఎదుర్కొంటున్న దేశాల్లో ఇండియా ఒకటి. కనుక, అసలు ఆ యుద్ధం ముగియాలని, లేదా కనీసం సరుకుల రవాణా సజావుగా సాగాలని కోరుకోవటం సహజం. ఇక్కడ సమస్య ఆ కోరికతో కాదు. కానీ, ఆ యుద్ధం ఎంత సంక్లిష్టమైనదో, రవాణా స్తంభనలు ఆ వ్యూహంలో ఎట్లా విడదీయరాని భాగంగా మారాయో తెలిసి కూడా ఇప్పుడు ఈ ప్రతిపాదనల కపటత్వమన్నది విమర్శించదగిన విషయమవుతున్నది. మరొకటి కూడా ఉన్నది. అది మరింత ముఖ్యమైనది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధమంటూ మొదలు కావటానికి కొన్ని మూల కారణాలున్నాయి. అవి తరచు చర్చకు వస్తున్నవే. సోవియెట్ యూనియన్, వార్సా సైనిక కూటమి 1991లో రద్దయిన తర్వాత, అమెరికా నాయకత్వాన ఉండిన నాటో సైనిక కూటమిని రద్దు చేయకపోవటమే గాక, ఆ కూటమిలోకి కొత్త దేశాలను చేర్చుకుంటూ రష్యా సరిహద్దుల వైపు విస్తరించటం మొదలుపెట్టారు. నాటో విస్తరణ ఉండదంటూ ఇచ్చిన మాటలు నిలబెట్టుకోలేదు. ఆ విధంగా విస్తరణలో ఉక్రెయిన్ వంతు వచ్చింది. అనగా రష్యాను పశ్చిమ దిశలో దిగ్బంధం చేయడమన్నమాట. అది తగదన్న రష్యా మాటను అమెరికా, యూరప్‌లు లెక్క చేయలేదు. ప్రధానంగా ఈ కారణం వల్లనే రష్యా ఆత్మరక్షణ కోసం 2014లో ఉక్రెయిన్ నుంచి క్రిమియాను స్వాధీనపరచుకున్న తర్వాత, 2022లో ఉక్రెయిన్‌పై దాడిని మొదలుపెట్టింది. ఈ వరుస క్రమాన్ని నిరుడు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైతం గుర్తించి మాట్లాడటం గమనించదగ్గది. భారత ప్రధాని ఈ మౌలిక విషయాలను గుర్తించకుండా, అందుకు పరిష్కారాలను చర్చించకుండా, పైపైన మెరుగుమాటలు మాట్లాడటం వల్ల ఉపయోగమేమిటి? తనకు ఎవరూ నమ్మని పబ్లిసిటీ తప్ప. పైగా ఇవన్నీ గతంలోనూ ఇతరుల ద్వారా ప్రతిపాదనకు వచ్చి విఫలమైనప్పుడు? సమస్య పరిష్కారానికి రష్యా ప్రతిపాదనలు ఏమిటి? ఉక్రెయిన్ కోరుకుంటే యూరోపియన్ యూనియన్‌లో చేరవచ్చు గానీ, నాటోలో చేరబోమని ప్రకటించాలి. ఆ మేరకు తమ రాజ్యాంగాన్ని సవరించాలి. వారిని చేర్చుకొనబోమని నాటో కూడా ప్రకటించాలి. ఉక్రెయిన్ తూర్పున రష్యా సరిహద్దుల్లో గల దోన్‌బాస్ ప్రాంతంలో అధిక సంఖ్యాకులైన రష్యన్ జాతీయులపై వివక్షలను ఆపివేసి, వారికి సముచిత స్థానాలు కల్పించాలి. భవిష్యత్తులో తమ రక్షణ కోసం దోన్‌బాస్ ప్రాంతాన్ని తమకు బఫర్‌జోన్‌గా వదలాలి. ఇవి ప్రధానం. ఇందులో గమనించవలసింది దోన్‌బాస్ ఇప్పటికే సుమారు 80 శాతం గత నాలుగేండ్ల యుద్ధంలో రష్యా ఆధీనంలోకి వెళ్లిపోయింది. తక్కినది కూడా వదలుకుని రాజీ చేసుకోవాలని స్వయంగా ట్రంప్ ఒకటికి నాలుగుసార్లు ఉక్రెయిన్ ప్రధాని జెలెన్‌స్కీకి సూచించారు. అదేమాట ఈ నెల 10న కూడా అన్నారు. ఒక దశలో జెలెన్‌స్కీ సైతం అర్ధాంగీకారం తెలిపారు. తాము కూడా అదేమాట అన్న యూరోపియన్ నాయకులు అంతలోనే మాట మా ర్చారు. యుద్ధానికి సాయపడుతున్నారు. ఆ విధంగా యుద్ధానికి లోతైన నేపథ్య కారణాలుండగా, ఆ సమస్య పరిష్కారానికి చిక్కుముళ్లు అనేకం ఉన్నాయి. అవి తేలనంతవరకు నల్ల సముద్ర ప్రాంతంలో, ఇతరత్రా కూడా ఉభయపక్షాల మధ్య యుద్ధం సాగుతూనే ఉంటుంది. సరకుల రవాణాకు ఆటంకాలు కల్పించటం కూడా యుద్ధ వ్యూహంలో భాగమే. అది ఉద్దేశపూర్వకంగా అనుసరిస్తున్న వ్యూహం. అటువంటి స్థితిలో మీరు ఆ వ్యూహాన్ని మానుకుని మాకు మాత్రం సరకుల రవాణా జరిగేటట్టు చూడమంటూ చెప్పే శాంతిసూత్రాలు నెరవేరేవేనా? అవి సొంత పబ్లిసిటీకి తప్ప ఎందుకూ ఉపయోగపడవు. ఇది ఇరాన్ యుద్ధంలో, ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌ల యుద్ధం గురించి ఏమీ మాట్లాడకుండా, హోర్ముజ్‌ను తెరవండి అంటూ ఇరాన్‌కు ప్రతిపాదించటం వంటిదే. మోదీ విశ్వగురుత్వం ఎంత అర్థరహితమైనదో అనేక ఇతర దృష్టాంతాలతోపాటు ఇది కూడా చెప్తున్నది.

# కరవుపై కార్యాచరణ ఏదీ?



ఆకాశం కరుణించకపోతే రైతు పొలంలో పచ్చదనం క్రమంగా మాయమవుతుంది. బావుల్లో నీరు తగ్గుతుంది. చెరువులు వెలవెలబోతాయి. పంట కోసం చేసిన అప్పులు మాత్రం అలాగే ఉంటాయి. వర్షం కోసం ఎదురుచూసే రైతుకు ప్రతి రోజు భారంగా మారుతుంది. తెలంగాణలో ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులు వ్యవసాయ రంగానికే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. ఎల్‌నినో అనేది భూమధ్యరేఖ సమీపంలోని పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే పెరగడంతో ఏర్పడే సహజ వాతావరణ దృగ్విషయం. ఇది ప్రపంచవ్యాప్తంగా గాలుల గమనాన్ని, వర్షపాతం పంపిణీని, ఉష్ణోగ్రతలను ప్రభావితం చేయగలదు. కొన్ని ప్రాంతాల్లో వర్షాభావం, మరికొన్ని ప్రాంతాల్లో అధిక వర్షాలు సంభవించే అవకాశాలను పెంచుతుంది. ప్రపంచ వాతావరణ సంస్థ అంచనాలను ఉటంకిస్తూ అక్టోబర్ 8న రాయిటర్స్ ప్రచురించిన నివేదిక ప్రకారం, ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితి మరింత బలపడి 2027 ఫిబ్రవరి వరకు కొనసాగేందుకు అధిక అవకాశం ఉంది. ఇది గత దశాబ్దాల బలమైన ఎల్‌నినో పరిస్థితుల్లో ఒకటిగా మారవచ్చని అంచనా వేస్తున్నారు. అయితే ఎల్‌నినో ఉందంటే తెలంగాణలో తప్పనిసరిగా కరువు వస్తుందని చెప్పలేం. రాష్ట్రంలో వర్షాలు ఎప్పుడు, ఎక్కడ, ఎంత మేరకు కురుస్తాయి అన్నది స్థానిక వాతావరణ పరిస్థితులు, వర్షాల విస్తరణ, నేల తేమ, నీటి నిల్వలపై కూడా ఆధారపడి ఉంటుంది. అందుకే వాతావరణ హెచ్చరికలను భయాందోళనలకు కారణంగా కాకుండా ముందస్తు ప్రణాళికకు మార్గదర్శకంగా తీసుకోవాలి. ఎండలు తీవ్రమయ్యాక, బావులు ఎండిపోయాక, పంటలు ఎండిపోవడం మొదలయ్యాక స్పందించడం కంటే ముందుగానే నీటి వినియోగం, పంటల ఎంపిక, ప్రత్యామ్నాయ సాగు, రైతుల ఆర్థిక రక్షణపై చర్యలు తీసుకోవడం మేలు. వర్షాభావ పరిస్థితుల్లో నీటి నిర్వహణ ప్రభుత్వానికి అత్యంత కీలకమైన పరీక్ష. తాగునీటికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలి. గ్రామాలు, పట్టణాల్లో నీటి సరఫరా పరిస్థితిని ముందుగానే అంచనా వేసి, అవసరమైతే ప్రత్యామ్నాయ సరఫరా ఏర్పాట్లు చేయాలి. బోర్లు, చేతిపంపులు, నీటి ట్యాంకులు, పైపులైన్ల పనితీరును పరిశీలించాలి. నీటి నాణ్యతను పరీక్షించాలి. ట్యాంకర్ల ద్వారా సరఫరా అవసరమయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించాలి. సాగునీటి విషయంలో కూడా శాస్త్రీయ ప్రణాళిక అవసరం. జలాశయాల్లో ఉన్న నీటి నిల్వలు, భవిష్యత్తులో అందే ప్రవాహాలు, తాగునీటి అవసరాలు, పంటల ప్రస్తుత దశలను పరిగణనలోకి తీసుకుని నీటి విడుదలపై నిర్ణయాలు తీసుకోవాలి. రైతులకు నీటి విడుదలపై ముందస్తు సమాచారం ఇవ్వాలి. నీరు అందుబాటులో లేని ప్రాంతాల్లో అధిక నీరు అవసరమయ్యే పంటలపై ఆధారపడకుండా ప్రత్యామ్నాయాలపై వ్యవసాయ నిపుణుల సలహాలు అందించాలి. వర్షపు నీటిని నిల్వ చేసే చెరువులు, కుంటలు, పాత నీటి వనరులను పునరుద్ధరించడం తాత్కాలిక చర్య మాత్రమే కాదు; దీర్ఘకాలిక నీటి భద్రతకు కూడా పునాది. అయితే ప్రతి ప్రాంతానికి ఒకే పరిష్కారం సరిపోదు. భూగర్భజలాల స్థితి, నేల స్వభావం, స్థానిక వర్షపాతం, సాగు పద్ధతులను బట్టి ప్రణాళిక రూపొందించాలి. నీటి కొరత ఏర్పడినప్పుడు రైతులు బోర్లపై ఆధారపడే అవకాశం పెరుగుతుంది. దీంతో మోటార్ల వినియోగం, విద్యుత్ డిమాండ్ కూడా పెరుగుతాయి. ఒకవైపు వ్యవసాయానికి విద్యుత్ అవసరం, మరోవైపు గృహాలు, పరిశ్రమలు, తాగునీటి పథకాలకు సరఫరా కొనసాగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు విద్యుత్ డిమాండ్‌ను ముందుగానే అంచనా వేసి సరఫరా ప్రణాళిక సిద్ధం చేయాలి. విద్యుత్ కొనుగోలు అవసరాలు, సరఫరా వ్యవస్థ సామర్థ్యం, అత్యవసర మరమ్మతులపై స్పష్టమైన కార్యాచరణ ఉండాలి. విద్యుత్ ఆదా చేయాలనే పిలుపు ఇవ్వడం అవసరమే అయినప్పటికీ, దాని భారం రైతులపైనే పడకుండా చూడాలి. వ్యవసాయ మోటార్లకు నాణ్యమైన సరఫరా, తాగునీటి పథకాలకు నిరంతర విద్యుత్, గ్రామీణ ప్రాంతాల్లో సరఫరా అంతరాయాలపై వేగవంతమైన స్పందన అవసరం. కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 20 వేల కోట్ల ప్రత్యేక ఆర్థిక సాయం అందించాలని తెలంగాణ ప్రభుత్వం కోరినట్లు సమాచారం. ఈ అంశంపై రాష్ట్ర శాసనసభలో కూడా కేంద్ర సహాయం కోరుతూ తీర్మానం చేసినట్లు నివేదికలు పేర్కొన్నాయి. అయితే ఆర్థిక సాయం కోరడం ఒక దశ మాత్రమే. ఎంత నిధి అవసరం, ఏ జిల్లాల్లో ఎంత నష్టం, ఏ రంగానికి ఎంత ఖర్చు, ఏ కాలవ్యవధిలో సహాయం అందించాలి అనే అంశాలతో కూడిన సమగ్ర ప్రతిపాదన కేంద్రానికి సమర్పించాలి. నిధుల వినియోగానికి పారదర్శకమైన ప్రణాళిక ఉండాలి. కేంద్రం నుంచి సాయం కోరే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలో తక్షణమే చేపట్టగల చర్యలను వాయిదా వేయకూడదు. అదే సమయంలో కరువు తీవ్రతను అంచనా వేసి కేంద్రం కూడా నిబంధనల ప్రకారం సహాయంపై నిర్ణయం తీసుకోవాలి. ఎల్‌నినోను మనం ఆపలేం. వర్షాలను మన ఆదేశాలతో కురిపించలేం. కానీ వర్షాభావం వల్ల ప్రజలు ఎదుర్కొనే నష్టాన్ని తగ్గించగలం. రైతు పంట ఎండిపోకముందే స్పందించగలం. గ్రామంలో నీటి ఎద్దడి మొదలయ్యేలోపే ప్రత్యామ్నాయ సరఫరా ఏర్పాటు చేయగలం. విద్యుత్ కొరత తలెత్తకముందే సరఫరా ప్రణాళిక సిద్ధం చేయగలం. ఇవన్నీ ప్రభుత్వ పాలనా సామర్థ్యానికి సంబంధించిన అంశాలు. తెలంగాణలో 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్నట్లు నివేదికలు చెబుతున్నవేళ, ప్రతి మండలంలోని వాస్తవ పరిస్థితిని తెలుసుకోవడం అత్యవసరం. ఒకే రాష్ట్రంలోనూ కొన్ని ప్రాంతాల్లో పంట నష్టం తీవ్రంగా ఉండవచ్చు; మరికొన్ని ప్రాంతాల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉండవచ్చు. అందుకే ఒకే రకమైన నిర్ణయాల కంటే ప్రాంతాలవారీగా అవసరాలను గుర్తించి సహాయం అందించాలి. కరువు ప్రభావిత రైతులకు ఆర్థిక భరోసా, గ్రామీణ కుటుంబాలకు తాగునీటి భద్రత, పశువులకు మేత, వ్యవసాయ కూలీలకు ఉపాధి, పంటలకు మార్కెట్ మద్దతు వంటి అంశాలను ఒక సమగ్ర ప్యాకేజీలో భాగం చేయాలి. ప్రభుత్వం ప్రకటించే నిధుల మొత్తం కంటే, అవి బాధితుల జీవితాల్లో కలిగించే మార్పు ముఖ్యం. సమీక్షల సంఖ్య కంటే, క్షేత్రస్థాయిలో పరిష్కారమైన సమస్యల సంఖ్య ముఖ్యం. కరువు మండలాల జాబితా కంటే, ఆ మండలాల్లో రైతులకు అందిన సహాయం ముఖ్యం. కేంద్రం నుంచి సాయం కోరడం అవసరమే; కానీ రాష్ట్రం తన వనరులను సమర్థంగా వినియోగించి తక్షణ ఉపశమన చర్యలు చేపట్టడం కూడా అంతే ముఖ్యం

## నందికొట్కూరు చైర్‌పర్సన్ పీఠం బీసీ మహిళకు!

-ప్రభుత్వం అధికారికంగా రిజర్వేషన్ల ప్రకటన

-ఆశావహ మహిళా నేతల్లో పెరిగిన ఉత్సాహం

-అభ్యర్థి ఎంపికపై రాజకీయ పార్టీల్లో చర్చలు



**నందికొట్కూరు, అక్టోబర్ 13.(డ్రీమ్ టైమ్స్)**
నందికొట్కూరు మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిని బీసీ మహిళకు కేటాయిస్తూ ప్రభుత్వం అధికారికంగా రిజర్వేషన్లు ప్రకటించింది. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, నగర పంచాయతీల చైర్‌పర్సన్ పదవులకు సంబంధించి మున్సిపల్ పరిపాలన శాఖ అక్టోబర్ 12న ఆంధ్రప్రదేశ్ గెజిట్‌లో నోటిఫికేషన్ ప్రచురించింది. ఇందులో నందికొట్కూరు మున్సిపాలిటీ రిజర్వేషన్ వివరాలను కూడా వెల్లడించింది. రిజర్వేషన్ ఖరారు కావడంతో చైర్‌పర్సన్ పదవిని ఆశిస్తున్న మహిళా నాయకుల్లో ఉత్సాహం పెరిగింది. వివిధ రాజకీయ పార్టీల్లో అభ్యర్థుల ఎంపికపై చర్చలు మొదలయ్యే అవకాశం ఉంది. పార్టీ కోసం పనిచేసిన మహిళా నాయకులకు అవకాశం దక్కుతుందా? రాజకీయంగా బలమైన నాయకుల మద్దతు ఉన్నవారికి ప్రాధాన్యం లభిస్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. చైర్‌పర్సన్ అభ్యర్థి ఎంపికలో సామాజిక సమీకరణాలు, రాజకీయ బలం, ప్రజల్లో ఉన్న ఆదరణ కీలకం కానున్నాయి. ఆశావహులు పార్టీ ముఖ్య నాయకుల మద్దతు కోసం ప్రయత్నించే అవకాశముంది. ప్రధాన పార్టీల నుంచి ఎవరికి అవకాశం దక్కుతుంది? మున్సిపల్ పీఠాన్ని ఏ పార్టీ కైవసం చేసుకుంటుంది? అన్న అంశాలపై పట్టణ రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## కీళ్ల నొప్పులను నిర్లక్ష్యం చేయొద్దు!




**కర్నూలు, అక్టోబర్ 13.(డ్రీమ్ టైమ్స్)**
కీళ్ల నొప్పులు, వాపు, బిగుసుకుపోవడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే గుర్తించి, సకాలంలో వైద్య చికిత్స పొందాలని సీనియర్ రుమటాలజిస్ట్ డా. సృజన సూచించారు. ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవం సందర్భంగా సోమవారం కర్నూలులోని మెడికవర్ ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థరైటిస్ లక్షణాలు, వ్యాధి తీవ్రత, చికిత్సా విధానాలపై రోగులకు వివరించారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 12న ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవాన్ని నిర్వహిస్తారని వైద్యులు తెలిపారు. ఉదయం నిద్రలేచినప్పుడు కీళ్లు బిగుసుకుపోవడం, నడవడంలో ఇబ్బందులు, కీళ్ల వాపు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. రోగి ఆరోగ్య పరిస్థితి, వ్యాధి స్వభావం, తీవ్రతను బట్టి చికిత్స మారుతుందని డా. సృజన వివరించారు. వైద్యుల సలహా లేకుండా మందులు వాడటం, చికిత్సను మధ్యలో నిలిపివేయడం సరికాదన్నారు. కీళ్ల ఆరోగ్యానికి తగిన వ్యాయామం, ఆరోగ్యకరమైన జీవనశైలి అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రోగులు వైద్యులను కలిసి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. అనంతరం డా. గణేష్ కుమార్ రెడ్డి, డా. మంజునాథ్‌లతో కలిసి కేక్ కటింగ్ నిర్వహించారు. ఆసుపత్రి సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

## ఆర్మీ జవాన్‌పై పోలీసుల దాడి?



**అనంతపురం అక్టోబర్ 13.(డ్రీమ్ టైమ్స్)**
అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గ పరిధిలోని యాడికి మండల కేంద్రంలో ఆర్మీ జవాన్‌పై పోలీసులు దాడి చేశారనే ఆరోపణలు కలకలం రేపాయి. చైనా సరిహద్దులో విధులు నిర్వహిస్తున్న వంకం రఘునాథ్ దసరా పండుగ సందర్భంగా స్వగ్రామానికి వచ్చారు. రోజువారీ వ్యాయామం ముగించుకుని బైక్‌పై వస్తుండగా ఉదయం 6 గంటల సమయంలో కోన రోడ్డు సర్కిల్ వద్ద పోలీసులు వాహన తనిఖీల పేరుతో ఆపినట్లు సమాచారం. ఈ సందర్భంగా బైక్ తాళాలు తీసుకుని, దుర్భాషలాడుతూ కొట్టి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారని రఘునాథ్ ఆరోపించారు. తాను ఆర్మీ జవాన్‌నని గుర్తింపు కార్డులు చూపించినా పోలీసులు పట్టించుకోలేదని ఆయన పేర్కొన్నారు. ఆధారాల జిరాక్స్ కాపీలు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఘటనను గమనించిన స్థానికులు వీడియోలు తీయగా, కొన్ని దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. వీడియోలు తీసిన వారిని పోలీసులు అడ్డుకుని ఫోన్లు తీసుకున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. తనను బహిరంగంగా అవమానించిన చోటే ప్రజల సమక్షంలో పోలీసులు క్షమాపణ చెప్పాలని రఘునాథ్ డిమాండ్ చేశారు. బైక్, సెల్‌ఫోన్ తిరిగి ఇస్తామని చెప్పినా తీసుకోకుండా వెళ్లిపోయినట్లు సమాచారం. ఘటనపై పోలీసుల వివరణ తెలియాల్సి ఉంది.

# ప్రతి పేద కుటుంబానికి ఇంటి పట్టా ఇవ్వాలి

- ఎన్నికల హామీ మేరకు జర్నలిస్టులకు నివాస స్థలాలు కేటాయించాలి

- సీపీఐ రిలే నిరాహార దీక్షలకు ఏపీయూడబ్ల్యూజే సంఘీభావం




**కర్నూలు, అక్టోబర్ 13.(డ్రీమ్ టైమ్స్)**
ప్రతి పేద కుటుంబానికి నివాస స్థలం కేటాయించి ఇంటి పట్టా ఇవ్వడంతో పాటు గృహ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కర్నూలు కలెక్టరేట్ వద్ద సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో ఇంటి స్థలాల కోసం తొమ్మిది రోజులుగా కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు వారు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమానికి సీపీఐ నగర సహాయ కార్యదర్శి సీ. మహేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈ.ఎన్. రాజు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీ. కొండప్ప, ఐజేయూ సభ్యుడు కె. నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసులు గౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల ఇంటి స్థలం ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా అమలులో జాప్యం జరుగుతోందని విమర్శించారు. కర్నూలులో అనేక మంది పేదలు సొంత ఇళ్లు లేక అద్దె గృహాల్లో నివసిస్తూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సీపీఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేసి, ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు జర్నలిస్టులకు కూడా నివాస స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు కె. జగన్నాథం, మనోహర్ మాణిక్యం, డి. శ్రీనివాసులు, ఏపీయూడబ్ల్యూజే నాయకులు మధు, నగర అధ్యక్షుడు మల్లికార్జున, నాగరాజు, ఫోటో జర్నలిస్టుల యూనియన్ నాయకుడు రఫీ, సీపీఐ నగర నాయకులు బీసన్న, నాగరాజు, సీ. కుమార్, రామాంజనేయులు, మహిళా సమాఖ్య నాయకులు ధనలక్ష్మి, మునెమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ఎన్నికల సంఘం ఏకపక్ష వైఖరిని ఖండిస్తున్నాం.

-సీఈసీ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి.

-మాల మహానాడు జేఏసీ డిమాండ్ .



**నంద్యాల.(డ్రీమ్ టైమ్స్)**
నంద్యాల జిల్లా ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ స్వతంత్ర ప్రతి పతి కలిగిన ఎన్నికల వ్యవస్థను పక్కనపెట్టి, కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వానికి జేబీ సంస్థగా వ్యవహరిస్తున్నారని మాల మహానాడు జేఏసీ తీవ్రంగా ధ్వజమెత్తింది. నంద్యాలలోని మాల మహానాడు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాల మహానాడు జేఏసీ రాష్ట్ర కార్యదర్శి, నంద్యాల జిల్లా ప్రెసిడెంట్ మరియు స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్‌లు మాట్లాడారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలోని దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలు (బీసీ) మరియు మైనార్టీల ఓట్లను విచక్షణారహితంగా తొలగిస్తూ రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును కాలరాస్తున్నారని విమర్శించారు. బహుజన వర్గాల ప్రాతినిధ్యానికి గండికొట్టేలా కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం మొండి వైఖరితో వ్యవహరిస్తుండటం అత్యంత విచారకరమని, ఈ చర్యలను యావత్ భారతదేశం తీవ్రంగా ఖండిస్తోందని వారు తెలిపారు.?ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో విఫలమై, అధికార పార్టీ ప్రయోజనాల కోసం పనిచేస్తున్న జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. రాజ్యాంగం కల్పించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల హక్కుల పరిరక్షణ కోసం మరియు ఓటు హక్కు పరిరక్షణకై మాల మహానాడు ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాల మహానాడు జేఏసీ రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి,నంద్యాల జిల్లా ప్రెసిడెంట్ బండి దేవాంతకుడు , స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ వైసీ పుల్లయ్య,మరియుయువజన జిల్లా అధ్యక్షుడు బండి దేవదాసు,నంద్యాల జిల్లా మాల మహానాడు ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# ఏపీ 'మహిళా కమిషన్' సభ్యురాలిగా 'స్వాతిరెడ్డి' నియామకం

-ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ సభ్యురాలిగా 'స్వాతిరెడ్డి'

-ఆమె నియామకంపై రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

-గత ఎన్నికల ముందు సోషల్ మీడియాలో వేధింపులు ఎదుర్కొన్న స్వాతిరెడ్డి

-కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచినందుకు టీడీపీ - ప్రభుత్వంలో గుర్తింపు



**అమరావతి, అక్టోబర్ 13.(డ్రీమ్ టైమ్స్)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలిగా 'స్వాతి రెడ్డి' (గౌతమి శ్వేత కోట) నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. తెలుగుదేశం పార్టీకి గట్టి మద్దతుదారురాలిగా ఆమెకు గుర్తింపు ఉంది.గత ఎన్నికల ముందు 'స్వాతిరెడ్డి' సోషల్ మీడియా వేదికగా తీవ్రమైన వేధింపులను, ట్రోలింగ్‌ను ఎదుర్కొన్నారు. ఆ సమయంలో ఆమె టీడీపీకి మద్దతుగా తన గళాన్ని బలంగా వినిపించారు. ప్రతికూల పరిస్థితుల్లో, వేలాది మంది నుంచి ఆన్‌లైన్‌లో విమర్శలు ఎదురైనప్పటికీ ఆమె వెనకడుగు వేయకుండా పార్టీ వైఖరికి కట్టుబడి నిలిచారు. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో, కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన వారికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని అధిష్ఠానం భావిస్తోంది. ఈ క్రమంలో 'స్వాతిరెడ్డి' సేవలను గుర్తించి, ఆమెకు మహిళా కమిషన్‌లో సభ్యురాలిగా కీలక బాధ్యతలు అప్పగించారు. ఆమె నియామకంపై టీడీపీ శ్రేణులు, మద్దతుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అమరావతి నుంచి ఈ నియామకానికి సంబంధించిన ఉత్తర్వులు వెలువడ్డాయి.

**లోకేశ్ అన్న చెప్పింది ముమ్మాటికీ నిజం...స్వాతిరెడ్డి**
తన నియామకంపై స్వాతిరెడ్డి సోషల్ మీడియా వేదికగా స్పందించారు. " నన్ను గుర్తించిన నా దేవుడు, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు గారికి, అలాగే నన్ను గుర్తించిన నా అన్న లోకేశ్ గారికి సదా ఋణపడి ఉంటాను. ఈ రోజు మీరు నాకు ఏపీ మహిళా కమిషన్ సభ్యురాలిగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, మీరు నా మీద పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను. "కార్యకర్తే అధినేత" అని లోకేశ్ అన్న చెప్పిన మాటలు ముమ్మాటికీ నిజం. కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు నా పార్టీ తెలుగుదేశం కోసం కష్టపడుతూనే ఉంటాను" అంటూ ట్వీట్ చేశారు

# ఆమ్రపాలి క్యాడర్ వివాదం.. హైకోర్టులో తీర్పు రిజర్వ్

-ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలి పిటిషన్‌పై హైకోర్టులో తీర్పు రిజర్వ్

-తెలంగాణ క్యాడర్‌కు కేటాయించాలని గతంలో క్యాట్ ఇచ్చిన ఆదేశాలు

-క్యాట్ తీర్పుపై హైకోర్టు విధించిన స్టేను సవాల్ చేసిన ఆమ్రపాలి

-ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. తీర్పుపై సర్వత్రా ఆసక్తి



**అమరావతి,అక్టోబర్ 13.(డ్రీమ్ టైమ్స్)**
సీనియర్ ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలి తన క్యాడర్ కేటాయింపు వివాదంపై దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ ముగిసింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. దీంతో ఆమె క్యాడర్ కేటాయింపుపై నెలకొన్న ఉత్కంఠ కొనసాగుతోంది.

**ఆమ్రపాలిని ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు కేటాయించిన కేంద్రం**
రాష్ట్ర విభజన అనంతరం కేంద్ర ప్రభుత్వం ఆమ్రపాలిని ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు కేటాయించింది. అయితే, కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆమ్రపాలి కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన క్యాట్, ఆమెను ఏపీకి కేటాయిస్తూ జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను రద్దు చేయడంతో పాటు, తెలంగాణ క్యాడర్‌కు కేటాయించాలని ఆదేశాలు జారీ చేసింది.

**గతంలో స్టే విధించిన తెలంగాణ హైకోర్టు**
అయితే, క్యాట్ వెలువరించిన ఈ తీర్పుపై తెలంగాణ హైకోర్టు గతంలో స్టే విధించింది. దీంతో క్యాట్ ఆదేశాల అమలు నిలిచిపోయింది. హైకోర్టు ఇచ్చిన ఈ స్టే ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆమ్రపాలి ఉన్నత న్యాయస్థానం లోనే మరో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం, ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. హైకోర్టు వెలువరించే తుది తీర్పుతో ఆమ్రపాలి క్యాడర్ కేటాయింపు వ్యవహారంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది

# ప్రమాదాలకు దూరంగా ఉండండి..
# దసరా సెలవులను ఆనందంగా గడపండి..

**-ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు**



**ఒంగోలు, అక్టోబర్ 13.(డ్రీమ్ టైమ్స్)** దసరా సెలవులను విద్యార్థులు, యువత, వారి తల్లిదండ్రులు ఆనందంగా, సురక్షితంగా గడపాలని ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు సూచించారు. సెలవుల సమయంలో సరదాగా గడిపే క్రమంలో అప్రమత్తంగా ఉండాలని, ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.దసరా సెలవుల నేపథ్యంలో గ్రామాలు, పట్టణాల శివార్లలోని చెరువులు, బావులు, కాలువలు, ఇతర నీటి వనరుల వద్దకు పిల్లలు, యువకులు ఈత కోసం వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీటి లోతుపై అవగాహన లేకుండా నీటిలోకి దిగడం ప్రాణాపాయానికి దారి తీయవచ్చని హెచ్చరించారు. ఈత రాని వారు ఇతరుల ఒత్తిడికి లోనై నీటిలోకి దిగవద్దని స్పష్టం చేశారు.విద్యార్థులు సెలవుల సమయంలో పర్యాటక ప్రాంతాలను సందర్శించేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా ఉండాలని జిల్లా ఎస్పీ సూచించారు. పర్యాటక ప్రాంతాలను సందర్శించే సమయంలో పెద్దల పర్యవేక్షణలోనే వెళ్లాలని, అక్కడి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.తల్లిదండ్రులు తమ పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారు, ఎవరితో వెళ్తున్నారు అనే విషయాలపై నిరంతరం దృష్టి సారించాలని సూచించారు. పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా తీవ్ర ప్రమాదాలకు దారితీయవచ్చని తెలిపారు.

**మైనర్లకు వాహనాలు ఇస్తే చట్టపరమైన చర్యలు**

మైనర్లు సరదా కోసం ద్విచక్ర వాహనాలు లేదా ఇతర మోటారు వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశముందని ఎస్పీ హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే సంబంధిత వాహన యజమానులు, తల్లిదండ్రులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు, జరిమానా మరియు జైలు శిక్ష పడే అవకాశం ఉందని తెలిపారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారికి వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

జిల్లా లోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న చెరువులు, జలాశయాలు, కాలువలు, ఇతర నీటి ప్రవాహ ప్రాంతాల వద్ద ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు.విద్యార్థులు, యువత తమ విలువైన ప్రాణాలను క్షణిక సరదా కోసం ప్రమాదంలోకి నెట్టుకోవద్దని, తల్లిదండ్రులు, పోలీసుల సూచనలు పాటిస్తూ దసరా సెలవులను సురక్షితంగా, సంతోషంగా గడపాలని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు కోరారు.

## దుర్గామాత అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో సర్పంచ్ దంపతులు



**చింతపల్లి, అక్టోబర్ 13.(డ్రీమ్ టైమ్స్)** చింతపల్లి మండలం గోడకొండ్ల గ్రామంలో రచ్చబండ వద్ద ప్రతిష్ఠించిన దుర్గామాత అమ్మవారి అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాశగొని వెంకటయ్య, ఆయన సతీమణి హేమలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వల్లపు శ్రావణ్ గౌడ్, కమిటీ సభ్యులు సర్పంచ్ దంపతులను ఘనంగా సన్మానించారు.దుర్గామాత అమ్మవారి కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అన్నప్రసాద వితరణలో గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు రంగాచారి, గ్యార పోచయ్య, పోలేపల్లి లక్ష్మయ్య, మాదారం ముత్యాలు, వీరమల్ల వెంకటేష్ గౌడ్, గనగోని అశోక్ యాదవ్, బాధపెల్లి లాలుగౌడ్, ఆర్కపల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో రైతు మృతి





**దేవరకొండ, అక్టోబర్ 13.(డ్రీమ్ టైమ్స్)** విద్యుత్ షాక్‌కు గురై ఓ రైతు మృతి చెందిన ఘటన డిండి మండలం మాల్యాతండ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మాల్యాతండ గ్రామానికి చెందిన రత్లావత్ శివ (50) మంగళవారం ఉదయం 7:30 గంటల సమయంలో తన పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద స్విచ్ వేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య అచ్చాలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు డిండి ఎస్సై బాలకృష్ణ తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నామని, కేసుపై దర్యాప్తు కొనసాగుతోందని ఎస్సై వెల్లడించారు.

# దళపతి విజయ్' రాకతో
# విజయవాడ దద్దరిల్లింది..సీఎం చంద్రబాబు

**-బెజవాడలో విజయవాడ ఉత్సవ్ 2.0 కార్యక్రమం**

**-ఒకే వేదికపై ఏపీ సీఎం చంద్రబాబు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్**

**-యువత ఉత్సాహాన్ని చూసి పులకించిన చంద్రబాబు**

**-విజయవాడ ఉత్సవాల వేదికగా గోదావరి-కావేరి నదుల అనుసంధానంపై కీలక ప్రకటన**

**-ప్రధాని మోదీ నాయకత్వంలోనే ఐదు నదుల అనుసంధానం సాధ్యమని వెల్లడి**

**-యువత ఉత్సాహం చూస్తుంటే 2047 నాటికి భారత్ నంబర్ వన్‌గా**

**నిలుస్తుందని ధీమా**

**-రాష్ట్రాలు వేరైనా దేశాభివృద్ధే తమ లక్ష్యమని చంద్రబాబు స్పష్టీకరణ**



**అమరావతి,అక్టోబర్ 13.(డ్రీమ్ టైమ్స్)** తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ రాకతో విజయవాడ నగరం దద్దరిల్లిపోతోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విజయవాడలో నిర్వహించిన 'విజయవాడ ఉత్సవ్ 2.0' సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన విజయ్‌తో కలిసి ఆయన వేదికను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు ఉద్వేగ్నంగా ప్రసంగించారు. దుర్గమ్మ, భారత్ మాత, తెలుగు తల్లికి జయజయధ్వానాలు పలుకుతూ తన ప్రసంగాన్ని ప్రారంభించిన ఆయన, సభకు హాజరైన యువత ఉత్సాహాన్ని చూసి పులకించిపోయారు. "విజయ్ రాకతో మీ ఉత్సాహం చూస్తుంటే విజయవాడ దద్దరిల్లిపోతోంది" అంటూ సభికులను ఉత్తేజపరిచారు.

**రెండేళ్లలోనే పార్టీ పెట్టి ముఖ్యమంత్రి అయిన వ్యక్తి విజయ్**

తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక దళపతి విజయ్ మొట్టమొదటిసారిగా మరో రాష్ట్రానికి వచ్చారని, ఆ గడ్డ పవిత్రమైన విజయవాడ కావడం, దుర్గమ్మ తల్లే ఆయన్ను ఇక్కడికి పిలిపించడం సంతోషంగా ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. తమిళనాడును అభివృద్ధి చేయాలనే బలమైన పట్టుదలతో, కేవలం రెండేళ్లలోనే పార్టీ పెట్టి ముఖ్యమంత్రి అయిన వ్యక్తి విజయ్ అని కొనియాడారు. ఆయన పట్టుదల, అంకితభావం ఎందరికో స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న ఆర్గనైజింగ్ కమిటీని ఆయన మనస్ఫూర్తిగా అభినందించారు.

**రాష్ట్రాలు వేరు కావచ్చు, కానీ మా అందరి అభిమతం ఒకటే**

ఈ సందర్భంగా చంద్రబాబు జాతీయ రాజకీయాలు, నదుల అనుసంధానంపై కీలక వ్యాఖ్యలు చేశారు. "రాష్ట్రాలు వేరు కావచ్చు, కానీ మా అందరి అభిమతం ఒకటే. భారతదేశం, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సహా అన్ని రాష్ట్రాలు బాగుండాలి" అని ఆయన స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఏదైనా సాధ్యమేనని చెబుతూ, గోదావరి-కావేరి నదుల అనుసంధానం త్వరలోనే జరుగుతుందని ప్రకటించారు. "దుర్గమ్మ తల్లి సాక్షిగా, మన విజయవాడ నుంచే గోదావరి, కృష్ణమ్మ తల్లులు కలుస్తాయి. ఈ మహత్కార్యాన్ని నెరవేర్చగల ఏకైక నాయకుడు నరేంద్ర మోదీ" అని ఆయన అన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే గోదావరి, కృష్ణ, పెన్నా, తుంగభద్ర, కావేరి నదులు అనుసంధానమై నాలుగు రాష్ట్రాలు సస్యశ్యామలం అవుతాయని వివరించారు.

**2047 నాటికి భారతదేశం ప్రపంచంలోనే నంబర్ వన్..**

వేదిక కింద ఉన్న యువతను, వారి ఉత్సాహాన్ని చూస్తుంటే భారతదేశ భవిష్యత్తుపై తనకు సంపూర్ణ విశ్వాసం కలుగుతోందని చంద్రబాబు అన్నారు. "టెక్నాలజీ, నాలెడ్జ్‌తో భారత యువత ప్రపంచంలో ఏదైనా సాధించగలదు. మీ ఉత్సాహం చూశాక, 2047 నాటికి భారతదేశం ప్రపంచంలోనే నంబర్ వన్ అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**ఆధ్యాత్మికతను జోడించి ముందుకు సాగాలి**

టెక్నాలజీ, నాలెడ్జ్‌కు ఆధ్యాత్మికతను జోడించి ముందుకు సాగితే అనుకున్న లక్ష్యాలను సులభంగా సాధించవచ్చని, విజయవాడ ఉత్సవాలు వంటి కార్యక్రమాలు ఆ ఆధ్యాత్మిక స్ఫూర్తిని నింపుతాయని తెలిపారు. అనంతరం, వెండితెరపై కోట్లాది మంది అభిమానాన్ని చూరగొని, ప్రజా జీవితంలోకి అడుగుపెట్టిన తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ను ప్రసంగించవలసిందిగా చంద్రబాబు సాదరంగా ఆహ్వానించారు

# ఏపీ స్థానిక సమరం..'కూటమిలో 'సీట్ల' 'సర్దుబాటు'పై తీవ్ర కసరత్తు..

**-ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక ఎన్నికల వేళ ఎన్డీయేలో జోరందుకున్న సీట్ల పంపకాల చర్చలు**

**-ముందుగా జనసేనతో డీల్ ఖరారు**

**-ఆపై బీజేపీతో చర్చించాలని చంద్రబాబు నిర్ణయం**

**-తమ త్యాగాలకు గుర్తింపుగా తగిన ప్రాతినిధ్యం ఇవ్వాలని కోరిన పవన్**

**-మంగళవారం రాత్రి సీఎం నివాసంలో టీడీపీ, జనసేన నేతల తుది భేటీ**

**-అక్టోబర్ 14న నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉండటంతో చర్చల్లో పెరిగిన వేగం**



**అమరావతి,అక్టోబర్ 13.(డ్రీమ్ టైమ్స్)** ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అధికార ఎన్డీయే కూటమిలో సీట్ల పంపకాలపై మంతనాలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. మంగళవారం నాడు తెలుగుదేశం, జనసేన, బీజేపీ నేతల మధ్య చర్చలు తారాస్థాయికి చేరాయి. కూటమి లోని భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల సర్దుబాటును సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

**నేడు ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం...**

అక్టోబర్ 14న ఎన్నికల షెడ్యూల్ వెలువడవచ్చన్న అంచనాల నేపథ్యంలో, ఆ లోపే పంపకాలను పూర్తి చేసి ఐక్యంగా బరిలోకి దిగాలని కూటమి భావిస్తోంది.ఈ క్రమంలో భాగంగా నేడు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ముఖ్యమంత్రి చంద్రబాతో సమావేశమయ్యారు. రెండు రోజుల్లో వీరి మధ్య ఇది రెండో దఫా చర్చలు కావడం గమనార్హం. అయితే, బీజేపీతో చర్చలను కొలిక్కితెచ్చే ముందు, జనసేనకు కేటాయించాల్సిన సీట్లపై ఒక స్పష్టతకు రావాలని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యూహంలో భాగంగానే ఆయన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడు తో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. అనంతరం, పల్లా శ్రీనివాసరావు, నిమ్మల రామా నాయుడు నేరుగా జనసేన కార్యాలయానికి వెళ్లి ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో చర్చలు జరిపారు. ఈ సమావేశంలో జనసేన తరఫున మంత్రి నాదెండ్ల మనోహర్, వంశీకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**తాజా సమాచారం ప్రకారం..**

మంగళవారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో టీడీపీ, జనసేన నేతలు మరోసారి భేటీ కానున్నారు. ఈ సమావేశంలోనే సీట్ల సర్దుబాటుపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ముఖ్యమైన నగరపాలక సంస్థల మేయర్ అభ్యర్థుల ఎంపికపైనా ఈ భేటీలో చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జనసేన, బీజేపీలు తమ బలాబలాల ఆధారంగా ఆశిస్తున్న స్థానాల జాబితాను చంద్రబాబుకు అందజేశాయి. పార్టీల గెలుపు అవకాశాలను బట్టి సీట్ల కేటాయింపు ఉంటుందని కూటమి వర్గాలు చెబుతున్నాయి. గత వారం కూడా చంద్రబాబు, పవన్ కల్యాణ్ మధ్య సీట్ల పంపకాలు, ఎన్నికల వ్యూహాలు, క్షేత్ర స్థాయిలో సమన్వయం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చలు జరిగాయి.

**స్థానిక సంస్థల్లో తమకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలి**

ఈ చర్చల నేపథ్యంలో, అక్టోబర్ 11న పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కూటమి ఏర్పాటు, విజయం కోసం జనసేన, జన సైనికులు ఎన్నో త్యాగాలు చేశారని, ఆ త్యాగాలకు గుర్తింపుగా మిత్ర ధర్మాన్ని అనుసరించి స్థానిక సంస్థల్లో తమకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన స్పష్టం చేశారు. "2024 ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్తు కోసం పోరాడాం. ఇప్పుడు జరగబోయే స్థానిక ఎన్నికలు జనసైనికుల భవిష్యత్తుకు భరోసా ఇస్తాయని ఆశిస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు.

**2014లో కూడా జన సైనికులు త్యాగాలు చేశారు**

2014లో కూడా జనసైనికులు త్యాగాలు చేశారని పవన్ తెలిపారు. "2014లో కూటమికి మద్దతుగా నిలిచినప్పుడు ఒక్క జన సైనికుడు కూడా పదవి ఆశించలేదు. రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని నిస్వార్థంగా పనిచేశారు. వ్యక్తిగత ప్రయోజనాలను పక్కన పెట్టి పార్టీ కోసం, కూటమి కోసం ఎన్నో త్యాగాలు చేశారు" అంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల ద్వారా, స్థానిక ఎన్నికల్లో తమ పార్టీ శ్రేణులకు న్యాయం జరగాలనే సంకేతాన్ని పవన్ బలంగా పంపారు. దీంతో సర్దుబాటు ప్రక్రియలో జనసేన డిమాండ్లకు ఎలాంటి ప్రాధాన్యం లభిస్తుందనేది ఆసక్తికరంగా మారింది

# బిజినెస్

## మళ్లీ తగ్గిన బంగారం ధరలు

-22 క్యారెట్ల పసిడిపై రూ.350 తగ్గింపు
-24 క్యారెట్ల బంగారంపై రూ.390 డౌన్
-కేజీ వెండిపై రూ.100 తగ్గుదల
-తెలుగు రాష్ట్రాల్లోనూ ఇవే ధరలు
-కొనుగోలుదారులకు కొంత ఊరట
--ధరల కదలికపై బులియన్ మార్కెట్‌లో ఆసక్తి



బంగారం ధరలు మంగళవారం మళ్లీ తగ్గాయి. బులియన్ మార్కెట్‌లో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.350 తగ్గి రూ.1,36,850కు చేరింది. అలాగే 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.390 తగ్గి రూ.1,49,290 వద్ద కొనసాగుతోంది. వెండి ధర కూడా స్వల్పంగా దిగివచ్చింది. కేజీ వెండిపై రూ.100 తగ్గడంతో ప్రస్తుతం రూ.2,44,900 పలుకుతోంది. బంగారం, వెండి ధరల్లో ఈ తగ్గుదలతో కొనుగోలుదారులకు కొంత ఊరట లభించింది. తెలుగు రాష్ట్రాల్లోనూ ఇవే ధరలు ఉండనున్నాయి. అయితే ఆభరణాల కొనుగోలుపై పన్నులు, తయారీ ఛార్జీలు అదనంగా వర్తించవచ్చు.

## ఎయిర్‌టెల్ రూ.348తో కొత్త ప్లాన్

-28 రోజుల పాటు ప్లాన్ చెల్లుబాటు
-రోజుకు 2 జీబీ డేటా.. అపరిమిత కాలింగ్
-ప్రతిరోజూ 100 ఎస్ఎంఎస్‌లు ఉచితం
-ఏడాది పాటు అడోబ్ ఎక్స్‌ప్రెస్ ప్రీమియం
-రూ.4 వేల వరకు ఆదా చేసుకునే అవకాశం
-స్పామ్ కాల్స్ హెచ్చరికలు.. మోసపూరిత లింకుల నిరోధం




ప్రపంచంలో రెండో అతిపెద్ద టెలికాం ఆపరేటర్‌గా ఉన్న భారతీ ఎయిర్‌టెల్ తన వినియోగదారుల కోసం రూ.348తో కొత్త ప్రీపెయిడ్ ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ప్లాన్ 28 రోజుల చెల్లుబాటుతో వస్తుంది. ఇందులో భాగంగా వినియోగదారులకు ప్రతిరోజూ 2 జీబీ డేటా, 100 ఎస్ఎంఎస్‌లు, అపరిమిత వాయిస్ కాలింగ్ సదుపాయాలు లభిస్తాయి. దీంతో పాటు ఏడాది పాటు అడోబ్ ఎక్స్‌ప్రెస్ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్‌ను ఉచితంగా అందిస్తోంది. సాధారణంగా ఈ సబ్‌స్క్రిప్షన్ కోసం చెల్లించాల్సిన మొత్తంతో పోలిస్తే వినియోగదారులు రూ.4 వేల వరకు ఆదా చేసుకునే అవకాశం ఉంటుంది. డిజిటల్ కంటెంట్ రూపకల్పన, ఫొటోలు, పోస్టర్లు, ఇతర ఆకర్షణీయమైన డిజైన్లు రూపొందించుకునే వారికి ఈ సదుపాయం ఉపయోగపడుతుంది. వీటితో పాటు స్పామ్ కాల్స్‌పై హెచ్చరికలు, మోసపూరిత లింకులను అడ్డుకునే భద్రతా ఫీచర్లను కూడా ఎయిర్‌టెల్ అందిస్తోంది. అదనంగా 30 రోజుల పాటు ఉచిత హలోట్యూన్స్ సదుపాయం కల్పిస్తోంది. తక్కువ ధరలో రోజువారీ డేటా, కాలింగ్‌తో పాటు అదనపు డిజిటల్ ప్రయోజనాలు కోరుకునే వినియోగదారులకు ఈ ప్లాన్ ఉపయోగకరంగా ఉండనుంది.

## ఎలక్ట్రిక్ కార్లకు సోలార్ పవర్ సాధ్యమేనా?

-పెరుగుతున్న విద్యుత్ కార్ల వినియోగం
-సౌరశక్తితో కార్లను ఛార్జ్ చేయడంపై ఆసక్తి
-కారు పైకప్పుపై పరిమిత స్థలమే ప్రధాన సమస్య
-సౌర ఫలకాల సామర్థ్యం తక్కువగా ఉండటంతో ఇబ్బందులు
-పూర్తిగా సూర్యరశ్మితో కారు నడపడం ప్రస్తుతానికి కష్టమే
-రోజుకు కొద్ది కిలోమీటర్ల ప్రయాణానికి సరిపడా విద్యుత్
-సౌరశక్తి వినియోగాన్ని పెంచేందుకు పరిశోధనలు
-భవిష్యత్తులో మెరుగైన సాంకేతికతపై ఆశలు



ప్రపంచవ్యాప్తంగా ఎలక్ట్రిక్ కార్ల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో వాటిని సౌరశక్తితో ఛార్జ్ చేయడంపై ఆసక్తి నెలకొంది. కారు పైకప్పుపై సౌర ఫలకాలను ఏర్పాటు చేసి సూర్యరశ్మి ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చా అనే అంశంపై పరిశోధనలు కొనసాగుతున్నాయి. అయితే, ప్రస్తుతం ఉన్న సాంకేతికతతో కారును పూర్తిగా సౌరశక్తితో నడపడం అంత సులభం కాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సాధారణ కారుతో పోలిస్తే ఎలక్ట్రిక్ కారుకు విద్యుత్ అవసరం ఎక్కువగా ఉంటుంది. కానీ కారు పైకప్పుపై సౌర ఫలకాలను అమర్చేందుకు స్థలం పరిమితంగా ఉంటుంది. దీనికి తోడు ఫలకాల సామర్థ్యం కూడా పరిమితంగానే ఉండటంతో అవసరమైనంత విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం కష్టమవుతోంది. ఫలితంగా సౌరశక్తితో లభించే విద్యుత్ రోజువారీ ప్రయాణంలో కొద్ది కిలోమీటర్లకు మాత్రమే సరిపోవచ్చు. అయినప్పటికీ సౌరశక్తి ద్వారా ఎలక్ట్రిక్ కార్ల బ్యాటరీకి కొంత మేర విద్యుత్‌ను అందించడం ఉపయోగకరమే. ఇది ఇతర మార్గాల్లో ఛార్జింగ్ చేయాల్సిన అవసరాన్ని కొంత తగ్గించవచ్చు. సౌర ఫలకాల సామర్థ్యాన్ని పెంచడం, తక్కువ స్థలంలో ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి చేసే సాంకేతికతలను అభివృద్ధి చేయడంపై పరిశోధనలు కొనసాగుతున్నాయి. భవిష్యత్తులో ఈ రంగంలో మరింత పురోగతి సాధ్యమని నిపుణులు భావిస్తున్నారు.

# స్పోర్ట్స్

## మొన్నటి వరకు మెంటర్.. ఇప్పుడు బ్యాటింగ్ కోచ్‌గా యువరాజ్..!




: భారత మాజీ ఆటగాడు యువరాజ్ సింగ్‌కి కీలక పదవి దక్కింది. ఒకప్పుడు సిక్సర్లతో అలరించిన యూవీ ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ కోచింగ్ యూనిట్‌లో చేరాడు. టీ20ల్లో విధ్వంసక ఆటగాడిగా పేరొందిన ఈ మాజీ ఆల్‌రౌండర్ ఢిల్లీ జట్టుకు అసిస్టెంట్, బ్యాటింగ్ కోచ్‌గా నియమితులయ్యాడు. మొన్నటి వరకు టీమిండియా ఆటగాళ్లు అభిషేక్ శర్మ, ప్రభ్‌సిమ్రన్ సింగ్ వంటి వారికి మెంటర్‌గా వ్యవహరించిన అతడు ఈసారి ఢిల్లీ కుర్రాళ్ల ఆటను సానబెట్టనున్నాడు.ఐపీఎల్ 20వ సీజన్ వేలానికి ముందే ఢిల్లీ క్యాపిటల్స్ వేగం పెంచింది. ఇటీవలే సౌరవ్ గంగూలీకి ప్రధాన కోచ్ బాధ్యతలు అప్పగించిన డీసీ.. అనుభవజ్ఞుడైన యువరాజ్ సింగ్‌ను తమ కోచింగ్ సిబ్బందిలోకి ఆహ్వానించింది. టీమిండియా స్టార్ అభిషేక్ శర్మ, మెరుపు ఆటతో అలరించే ప్రభ్‌సిమ్రన్ సింగ్‌కు మెంటర్‌గా మంచి ఫలితాలు రాబట్టిన యూవీని తమ జట్టుకు అసిస్టెంట్, బ్యాటింగ్ కోచ్‌గా నియమించింది. దాంతో.. అధికారికంగా యూవీ తొలిసారి కోచింగ్ బాధ్యలు చేపట్టనున్నాడు. ఈ దిగ్గజ ఆటగాడిని ఢిల్లీ సహాయక కోచ్‌గా తీసుకున్న విషయాన్ని మంగళవారం హెడ్‌కోచ్ గంగూలీ వెల్లడించాడు. 'ఢిల్లీ క్యాపిటల్స్ కుటుంబంలోకి యూవీని ఆహ్వానిస్తున్నందుకు నాకు చాలా థ్రిల్లింగ్‌గా ఉంది' అని ఫ్రాంఛైజీ చైర్మన్ పార్త్ జిందాల్ వెల్లడించాడు. 'భారత జట్టు గొప్ప మ్యాచ్ విన్నర్లలో యూవీ ఒకడు. అంతేకాదు ప్రస్తుతం టీమిండియలో ఉన్న యువ ఆటగాళ్లకు అతడు మెంటర్‌గానూ వ్యవహరించాడు. అతడి అనుభవం, విజయమే లక్ష్యంగా ఆలోచనలు.. ఆటగాళ్లతో కలిసిపోయే తీరు మా స్క్వాడ్‌కు అమూల్యమైనవి' అని జిందాల్ పేర్కొన్నాడు. యువరాజ్ కూడా పాత ఫ్రాంఛైజీకి సేవలందించడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పాడు.

**రికార్డు ధర..**

ఒకప్పుడు ఐపీఎల్‌లో ఢిల్లీ జట్టుకు ఆడిన యువరాజ్ ఈసారి కోచ్‌గా వస్తున్నాడు. 2015 ఎడిషన్ వేలంలో ఢిల్లీ ఫ్రాంచైజీ అతడిని రూ.16 కోట్లకు కొన్నది. ఈ మెగా ఈవెంట్లో అప్పటివరకూ అంత ధర పలికింది యూవీనే. దాంతో.. ఐపీఎల్ చరిత్రంలో అత్యంత విలువైన ఆటగాడిగా అతడు రికార్డు నెలకొల్పాడు. ఆ సీజన్‌లో 14 మ్యాచులాడిన ఈ లెఫ్ట్ హ్యాండర్ రెండు అర్థ శతకాలతో కలిపి 248 పరుగులు చేశాడు. మొత్తంగా పది సిక్సర్లు బాదిన అతడి అత్యధిక స్కోర్.. 57.

## జగజ్జేతకు ఆసీస్ ఝలక్..

-డర్బన్ టెస్టులో దక్షిణాఫ్రికాపై ఆస్ట్రేలియా ఘనవిజయం
-214 పరుగుల తేడాతో కంగారూల గెలుపు
-రెండో ఇన్నింగ్స్‌లో 206 పరుగులకే కుప్పకూలిన సఫారీలు
-ఆరు వికెట్లతో చెలరేగిన జోష్ హేజిల్‌వుడ్
-75 పరుగులతో పోరాడిన ఎడెన్ మర్క్‌రమ్
-కీలక సమయాల్లో వికెట్లు కోల్పోయి దక్షిణాఫ్రికా పరాజయం
-సొంతగడ్డపై రెండేళ్ల విజయాల పరంపరకు బ్రేక్
-అక్టోబర్ 18న రెండో టెస్టులో మళ్లీ తలపడనున్న జట్లు




డర్బన్: ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ విజేత దక్షిణాఫ్రికాకు ఆస్ట్రేలియా భారీ షాక్ ఇచ్చింది. సొంతగడ్డపై గత రెండేళు ్లగా ఓటమి ఎరుగని సఫారీ జట్టును డర్బన్ టెస్టులో 214 పరుగుల తేడాతో చిత్తుగా ఓడించింది. నాలుగో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా బౌలర్ జోష్ హేజిల్‌వుడ్ ఆరు వికెట్లతో విజృంభించడంతో దక్షిణాఫ్రికా రెండో సెషన్‌లోనే కుప్పకూలింది. 421 పరుగుల లక్ష్య ఛేదనలో ఎడెన్ మర్క్‌రమ్ 75 పరుగులతో పోరాడినా జట్టును ఓటమి నుంచి గట్టెక్కించలేకపోయాడు. ఐదో రోజు విజయానికి ఇంకా 319 పరుగులు అవసరమైన దశలో దక్షిణాఫ్రికా చేతిలో ఆరు వికెట్లు ఉండటంతో గెలుపుపై ఆశలు పెట్టుకుంది. అయితే హేజిల్‌వుడ్ దెబ్బకు ఆతిథ్య జట్టు బ్యాటర్లు వరుసగా పెవిలియన్ చేరారు. విల్ మల్డర్ 29 పరుగుల వద్ద ఔటవ్వగా, ఆ తర్వాత రెన్‌షా బౌలింగ్‌లో మరో కీలక వికెట్ పడింది. మార్కో యాన్సెన్ 35 పరుగులతో మర్క్‌రమ్‌కు అండగా నిలిచేందుకు ప్రయత్నించినా ఆసీస్ బౌలర్లను నిలువరించలేకపోయాడు. ఒకే ఓవర్‌లో యాన్సెన్, సైమన్ హార్మర్‌లను హేజిల్‌వుడ్ ఔట్ చేయడంతో దక్షిణాఫ్రికా కష్టాలు మరింత పెరిగాయి. అప్పటికే ఐదు వికెట్లు తీసిన అతడు, ఆ తర్వాత మర్క్‌రమ్ వికెట్‌ను మిచెల్ స్టార్క్ పడగొట్టడంతో సఫారీల విజయాశలు దాదాపుగా ముగిశాయి. చివరి బ్యాటర్ అన్రిచ్ నోర్జిని ఔట్ చేసిన హేజిల్‌వుడ్ తన ఖాతాలో ఆరో వికెట్ వేసుకున్నాడు. దీంతో దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 206 పరుగులకే పరిమితమైంది. బ్యాటింగ్, బౌలింగ్‌లో సమష్టిగా రాణించిన ఆస్ట్రేలియా డర్బన్ టెస్టులో అద్భుత విజయాన్ని అందుకుంది. కింగ్స్‌మీడ్ స్టేడియంలో కంగారూలకు ఇది వరుసగా నాలుగో టెస్టు విజయం కావడం విశేషం. మరోవైపు, టెస్టు ఛాంపియన్‌గా నిలిచిన తర్వాత దక్షిణాఫ్రికా కెప్టెన్ తెంబా బవుమాకు రెండేళ్ల కాలంలో ఇదే తొలి ఓటమిగా నిలిచింది. ఇరుజట్ల మధ్య రెండో టెస్టు అక్టోబర్ 18న జరగనుంది.

## మనస్పర్థలతో విడిపోయారు.. మనసు మారి మళ్లీ ఒక్కటయ్యారు..!

ఇటవలే బ్రేకప్ అయిన భారత క్రికెటర్ పృథ్వీ షా తీపికబురు చెప్పాడు. నెల క్రితం ప్రేయసి ఆకృతి అగర్వాల్ తమ నిశ్చితార్థం రద్దు చేసుకోవడంతో వార్తల్లో నిలిచిన అతడు.. ఇప్పుడు ఆమెతోనే జీవితం అంటున్నాడు. సెప్టెంబర్ 17న 'మేము విడిపోతున్నా'మని ప్రకటించిన ఆకృతి తాజాగా మేము మళ్లీ ఒక్కటయ్యాం, ఎంగేజ్‌మెంట్ క్యాన్సల్ చేసి బాధ పెట్టినందుకు బాధ్యత తీసుకుంటున్నా అని పోస్ట్ పెట్టింది. దాంతో.. నెలరోజులైన గడవక ముందే ఇద్దరి మనసు మారి మళ్లీ ఒక్కటయ్యారు. తమ ప్రేమ బంధాన్ని ఈసారి పెళ్లి వరకూ తీసుకెళ్లాలని ఇరువురు భావించడమే అందుకు కారణమని తెలుస్తోంది.కూర్చొని మాట్లాడుకుంటే భార్యభర్తల మధ్య గొడవలే కాదు.. ప్రేమికుల మధ్య అంతరమూ తగ్గిపోతోంది. అందుకు తాజా ఉదాహరణ భారత క్రికెటర్ పృథ్వీ షా. ఈ డాషింగ్ బ్యాటర్‌తో నిశ్చితార్థం చేసుకున్న ఆకృతి అగర్వాల్.. సెప్టెంబర్‌లో అతడికి బ్రేకప్ చెప్పింది. దాంతో.. వీరి ప్రేమ




పెళ్లిపీటలెక్కలేదని అంతా బాధ పడ్డారు. అయితే.. నెల తిరక్కముందే ఆకృతి మనసు మారింది. ఇద్దరూ కలిసి మాట్లాడుకొని తమ మధ్య ఉన్న మనస్పర్థలు, అపోహలను వదలించుకున్నారు. ఇంకేముంది.. మళ్లీ లవ్ ట్రాక్ మొదలైంది. ఇకపై నువ్వే నా జీవితం అంటూ మునపటిలా లైఫ్‌ను ఆస్వాదిస్తోంది జోడీ. తాజాగా వ్యక్తిగత జీవితం గురించిన స్పష్టత అంటై ఆకృతి పెట్టిన పోస్ట్‌తో వీరి ప్రేమ ఎంత బలమైనదో బయటపడింది.'మా నిశ్చితార్థాన్ని నేను రద్దు చేసుకున్నప్పుడు సన్నిహితుల అభిప్రాయాలకు అధిక ప్రాధాన్యమిచ్చా. మా అనుబంధం గురించి మాకంటే వారికే ఎక్కువ తెలియడమే అందుకు కారణం. అయితే.. నాకు కాబోయే భర్త గురించి, మా బంధం గురించి ఏవోవో చెప్పి వారు నన్ను తప్పుదోవ పట్టించారు. దాంతో.. పృథ్వీతో కలిసి మాట్లాడకుండానే నేను నిశ్చితార్థం రద్దు నిర్ణయం తీసుకున్నా. నేను కలిగించిన బాధకు నేనే బాధ్యత తీసుకుంటున్నా. మేమిద్దరం కలిసి మాట్లాడుకున్నాక ఒకరినొకరం మరింత అర్థం చేసకున్నాం. కలిసి బతకాలని నిర్ణయించుకున్నాం. మాకు మేము ఇలా ఉండిపోవాలి. వేరే ఎవరూ అవసరం లేదు. ఈసారి ప్రేమ, నమ్మకం, అర్థం చేసుకోవడం ద్వారానే మా భవిష్యత్ సాగాలని భావిస్తున్నా. మళ్లీ ఒక్కటిగా ఉండాలనుకున్న మా నిర్ణయాన్ని అందరూ గౌరవించాలి' అని ఆకృతి తమ ప్రేమ కథ పునరుద్ధరించబడిన తీరును వివరించింది.



పరువాలతో పిచ్చెక్కిస్తోన్న వయ్యారి!

## ప్రభాస్ 'కల్కి 2' మూవీకి

# సాయి పల్లవి గ్రీన్ సిగ్నల్..



పాన్-ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక సిక్వెల్ చిత్రం 'కల్కి 2'కు సంబంధించి ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి కొనసాగింపుగా వస్తున్న ఈ సీక్వెల్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. అయితే ప్రభాస్ ఇతర సినిమాల కమిట్‌మెంట్ల కారణంగా ఈ ప్రాజెక్ట్ షూటింగ్ కొద్దిగా నెమ్మదిగా సాగుతున్నట్లు తెలుస్తోంది.అయితే ఈ చిత్రంలో కీలకమైన పాత్ర కోసం ప్రముఖ నటి సాయి పల్లవి ఎంపికైన విషయం తెలిసిందే. వాస్తవానికి ఆమె ఈ అక్టోబర్ నెలలోనే సినిమా షూటింగ్ సెట్స్‌లో జాయిన్ కావాల్సి ఉండగా, మేకర్స్ ప్లాన్‌లో స్వల్ప మార్పులు జరిగినట్లు సమాచారం. ప్రస్తుతం సాయి పల్లవి తాను నటిస్తున్న 'రామాయణం' సినిమా ప్రమోషన్లు మరియు ఇతర కార్యక్రమాలపై పూర్తి దృష్టి పెట్టారు. ఈ పవిత్ర పౌరాణిక చిత్రం నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో, ఆ సినిమా రిలీజ్ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఆమె 'కల్కి 2' షూటింగ్ షెడ్యూల్‌లో అడుగుపెట్టనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే దీనిపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక క్లారిటీ రానుంది.

## 'పర్ణశాల' సినిమా నుంచి వైరల్

# 'జిమ్ జిమ్ తార' ఫుల్ సాంగ్ రిలీజ్!




హారర్ కామెడీ జోనర్‌లో వస్తున్న 'పర్ణశాల' చిత్రం నుంచి ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటున్న 'జిమ్ జిమ్ తార' పూర్తి పాటను చిత్ర యూనిట్ ప్రముఖ ఆదిత్య మ్యూజిక్ ద్వారా అధికారికంగా విడుదల చేసింది. జి.లక్ష్మీదేవి రచించి, స్వయంగా ఆలపించిన ఈ పాట ఇప్పటికే సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచింది. కాగా, తాజాగా ఫుల్ సాంగ్ విడుదల కావడంతో సినిమాపై అంచనాలు మరింత తారాస్థాయికి చేరాయి. ఈ సందర్భంగా దర్శకుడు వై.జి. భరత్ మాట్లాడుతూ మా చిత్రంలోని ఈ పాటకు ప్రేక్షకుల నుంచి ఊహించని స్థాయిలో అద్భుతమైన స్పందన వస్తోందని, ఆదిత్య మ్యూజిక్ ద్వారా పాటను విడుదల చేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. సోషల్ మీడియాలో ఇప్పటికే ఈ పాటకు నెటిజన్లు రీల్స్ చేస్తూ తెగ ఎంజాయ్ చేస్తున్నారని, పూర్తి పాట కూడా అందరినీ అలరిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పూర్తి పాట అధికారికంగా రాకముందే దీనికి సంబంధించిన క్లిప్స్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి.ఎస్ఎల్‌టీ ఫిలిమ్స్ పతాకంపై మంచి వెంకట్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, వై.జి. భరత్ దర్శకత్వం వహిస్తున్నారు. హారర్, కామెడీతో పాటు సస్పెన్స్ థ్రిల్లర్ అంశాలతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. వినూత్న ప్రచార కార్యక్రమాలతో దూసుకుపోతున్న ఈ చిత్రానికి అశోక్ దయ్యాల పీఆర్‌ఓగా వ్యవహరిస్తున్నారు.

# నితిన్‌కి జోడీగా?

లక్కీభాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం, అనగనగా ఒకరాజు చిత్రాలతో హ్యాట్రిక్ విజయాలను అందుకున్నది హర్యానా అందం మీనాక్షి చౌదరి. ప్రస్తుతం నాగచైతన్యకు జోడీగా 'వృషకర్మ' చిత్రంలో నటిస్తూ బిజీగా ఉన్న మీనాక్షికి మరో అద్భుతమైన అవకాశం వరించినట్టు ఫిల్మ్ వర్గాల్లో ఓ టాక్ బలంగా వినిపిస్తున్నది.'సామజవరగమన' వంటి బ్లాక్‌బస్టర్ తెరకెక్కించిన రామ్ అబ్బరాజు దర్శకత్వంలో నితిన్ హీరోగా ఓ రొమాంటిక్ కామెడీ సినిమా రూపొందనున్న విషయం తెలిసిందే. ఈసినిమాలో కథానాయికగా మీనాక్షి చౌదరి ఖరారైనట్టు వినికిడి. అయితే.. దీనిపై అధికారిక స్పష్టత రావాల్సివుంది. జనవరిలో సెట్స్‌పైకి వెళ్లే ఈసినిమాను ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ నిర్మించనున్నట్టు సమాచారం.



## బాక్సాఫీస్ వద్ద శ్రీ విష్ణు

# కామ్రేడ్ కళ్యాణ్' జోరు.

### -హిట్‌గా నిలిచిన కామెడీ డ్రామా!




వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్న టాలీవుడ్ హీరో శ్రీ విష్ణు మరోసారి బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటారు. ఆయన నటించిన తాజా కామెడీ డ్రామా 'కామ్రేడ్ కళ్యాణ్' తొలి వారాంతంలో మంచి వసూళ్లను సాధించినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. విడుదలైన తొలిరోజు నెమ్మదిగా ప్రారంభమైన ఈ సినిమా.. సాయంత్రం ఆటల నుంచి పుంజుకుంది. సినిమాకు సానుకూల స్పందన రావడంతో ప్రేక్షకుల సంఖ్య పెరిగింది. దీంతో నాలుగు రోజుల్లోనే బ్రేక్ ఈవెన్ అయిందని మేకర్స్ పోస్టర్ ద్వారా తెలియజేశారు. దసరా సెలవులు కూడా కలిసి రావడంతో ఈ సినిమా సూపర్ హిట్ కావడం ఖాయమనే అంచనాకు వస్తున్నారు.శ్రీ విష్ణు సినిమాలంటేనే వినోదంతో పాటు విభిన్నమైన కథాంశాలు గుర్తుకొస్తాయి. ఈ క్రమంలో వచ్చిన 'కామ్రేడ్ కళ్యాణ్' కూడా ప్రేక్షకులను ఆకట్టుకునే కామెడీ డ్రామాగా నిలుస్తోంది. విడుదలైన మొదటి రోజు ప్రారంభంలో వసూళ్లు ఆశించిన స్థాయిలో లేకపోయినప్పటికీ, సాయంత్రం ఆటల నుంచి పరిస్థితి మెరుగుపడింది. తొలి వారాంతంలో ఈ సినిమా తన జోరును కొనసాగించింది. సాధారణంగా కొత్త సినిమాలకు వారాంతంలో ప్రేక్షకుల ఆదరణ కీలకంగా ఉంటుంది. ఈ విషయంలో 'కామ్రేడ్ కళ్యాణ్'కు కలిసి రావడంతో బాక్సాఫీస్ వద్ద మంచి ప్రదర్శన కనబరిచినట్లు ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. చాలా సినిమాలకు సోమవారం నుంచి వసూళ్లు తగ్గడం సాధారణం. అయితే 'కామ్రేడ్ కళ్యాణ్' పనిదినాలలోనూ నిలకడను ప్రదర్శించింది. ఈ పరిణామంతో సినిమా హిట్ స్థాయికి చేరుకుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పటికే ఈ చిత్రాన్ని కొనుగోలు చేసిన పంపిణీదారులు సేఫ్ సైడ్‌లో ఉన్నట్టు కథనాలు పేర్కొంటున్నాయి. అయితే, సినిమా సూపర్‌హిట్‌గా నిలుస్తుందా లేదా అనేది రాబోయే రోజుల్లో వసూళ్లు ఏ స్థాయిలో కొనసాగుతాయనే అంశంపై ఆధారపడి ఉంటుంది. దసరా సందర్భంగా కొత్త సినిమాలు థియేటర్లలోకి వస్తున్న నేపథ్యంలో 'కామ్రేడ్ కళ్యాణ్' వాటి పోటీని తట్టుకుని ఎంతకాలం నిలబడుతుందన్నది కీలకంగా మారింది. 'కామ్రేడ్ కళ్యాణ్'లో శ్రీ విష్ణు సరసన మహిమా నంబియార్ కథానాయికగా నటించారు. జనకిరామ్ మరెళ్ల ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. సత్య, రాధిక, సుదర్శన్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే, సాయిచంద్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు.

## నవ్వులు పూయిస్తున్న

# 'ఉడ్తా తీర్' కొత్త ట్రైలర్!




బాలీవుడ్ హీరో ఆయుష్మాన్ ఖురానా, టాలెంటెడ్ హీరోయిన్ సారా అలీ ఖాన్ జంటగా నటిస్తున్న తాజా యాక్షన్-కామెడీ చిత్రం 'ఉడ్తా తీర్' . ఆకాష్ ఎ. కౌశిక్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా అక్టోబర్ 23న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి కొత్త ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ చిత్రంలో ఆయుష్మాన్ ఖురానా 'బిలాల్' అనే పాకిస్థానీ ఇంటెలిజెన్స్ ఏజెంట్ పాత్రలో కనిపించబోతున్నాడు. రహస్య మిషన్‌లో భాగంగా భారత్‌కు వచ్చిన అతను, అనుకోని ప్రమాదం కారణంగా తన జ్ఞాపకశక్తిని కోల్పోతాడు. ఇక అసలు కథ అక్కడి నుంచే మొదలవుతుంది. జ్ఞాపకశక్తి కోల్పోవడంతో తాను పాకిస్థాన్ తరఫున గూఢచారిగా వచ్చానన్న విషయాన్ని పూర్తిగా మరచిపోతాడు. అంతేకాదు, భారతదేశంలో ఉంటున్న సమయంలో అతడిలో విపరీతమైన దేశభక్తి పుట్టుకొచ్చి, తనే స్వయంగా ఇండియా కౌంటర్ టెర్రరిజం స్క్వాడ్ ఆఫీసర్ అని బలంగా నమ్ముకుంటాడు. పాకిస్థాన్ పంపిన గూఢచారి అనుకోకుండా ఇండియాకు అనుకూలంగా మారిపోయి, అక్కడే దేశభక్తుడిగా తిరుగుతుండటంతో పాకిస్థాన్ హ్యాండ్లర్లకు తలనొప్పిగా మారుతుంది. అయితే అనంతరం జరిగిన సంఘటనలు ఏంటి అనేది ఈ సినిమా కథ. ఇందులో సారా అలీ ఖాన్ పవర్ ఫుల్ సీటీఎస్ ఆఫీసర్‌గా సందడి చేయనున్నారు.ఈ చిత్రంతో ఆకాష్ కౌశిక్ దర్శకుడిగా పరిచయం అవుతుండగా, కరణ్ జోహార్‌కు చెందిన 'ధర్మ ప్రొడక్షన్స్' మరియు గునీత్ మోంగాకు చెందిన 'సిఖ్యా ఎంటర్‌టైన్‌మెంట్' సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ఈ సినిమాలో రాహుల్ బోస్, రామ్ కపూర్, గుషన్ గ్రోవర్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town -518501 nandyal district (AP) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831